# నామినేషన్ల స్వీకరణ సమర్థవంతంగా నిర్వహించాలి

◆ పొరపాట్లకు తావివ్వకండి ◆ నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



ఎన్నికల కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 28 ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేలా చూడాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసకుంటామని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ గణపట్ రావు పాటిల్ పేర్కొన్నారు. 2వ సాధారణ ఎన్నికల నేపధ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ స్వీకరణల ప్రక్రియను ఎన్ని కల సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల 2వరోజైన శుక్రవారం తెల్కపల్లి మండల పరిధిలోని గౌరెడ్డిపల్లి, తెల్కపల్లి క్లస్టర్లలో కొనసాగుతున్న నామినేషన్ల ప్రక్రియను జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ గణపట్ రావు పాటిల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెల్కపల్లి క్లస్టర్లు గ్రామపంచాయతీ కార్యాలయంలో తెల్కపల్లి, రాకొండ, రాంరెడ్డిపల్లి, కమ్మరెడ్డిపల్లి, దాసుపల్లి, గౌరెడ్డిపల్లి క్లస్టర్లు గ్రామపంచాయతీ కార్యాలయంలో గౌరెడ్డిపల్లి, లక్నారం, గోలగుండం, గట్టునెల్లికుదురు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. రిటర్నింగ్ అధికారులను నామినేషన్ ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ కేంద్రం ముందు ఫోటోతో ఓటర్ల జాబితా అదే విధంగా గ్రామాల వార్డుల వారిగా రిజర్వేషన్ల జాబితా అంటించాలన్నారు. నామినేషన్ కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో ఎవరూ గుంపులుగా రాకుండా చూసుకోవాలని రిటర్నింగ్ అధికారితో పాటు సహాయక రిటర్నింగ్ అధికారులక పలు సలహాలు సూచనలు అందజేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో తెల్కపల్లి మండల పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. తెల్కపల్లి మండలంలోని 7 క్లస్టర్లలో 28 గ్రామ పంచాయతీల్లో 28 సర్పంచ్ ఎన్నికలు, 260 వార్డులకు సంబంధించిన పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేలా అన్ని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి పక్కగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, శనివారంతో మొదటి విడత ఎన్నికలకు ముగియనున్న నామినేషన్ల ప్రక్రియ అనంతరం నామినేషన్ల పరిశీలన కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ గణపట్ రావు పాటిల్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన పారదర్శకమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత పోలీసులదేనని జిల్లా ఎస్పీ పోలీస్ సిబ్బందికి సూచించారు. ఎన్నికల నియమావళి ప్రకారం నామినేషన్ ప్రక్రియ పూర్తిగా నిష్పక్షపాతంగా, శాంతియుతంగా జరిగేలా పని చేయాలని పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛిత పరిస్థితులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు పారదర్శకమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రతి సిబ్బందిపైన ఉందని పేర్కొన్నారు. ఎన్నికల్లో శాంతి భద్రతలను కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. ఎన్నికల ప్రక్రియను భంగపరచాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలోని సెన్సిటివ్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ప్రతి పోలింగ్ కేంద్రంలో పకడ్బందీ బందోబస్తు, పెట్రోలింగ్, క్విక్ రెస్పాన్స్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అక్రమ డబ్బు, మద్యం పంపిణీ, బెదిరింపులు, అనైతిక ప్రలోభాలు వంటి తప్పిదాలు ఎక్కడైనా గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు ఎస్పి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ జాకీర్ అలీ, ఎంపీడీవో తరుణ్, ఎంపీఓ వెంకటేష్, ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, ఎస్సై నరేష్, కోటేశ్వరరావు, ఆయా గ్రామ పంచాయతీల రిటర్నింగ్ అధికారులు ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట





పెబ్బేరు సుగురు మధ్య రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

## రైతుల కష్టాలు ఒకవైపు ప్రమాదాలు మరోవైపు

◆ రోడ్లపై ఆరబోసిన ధాన్యంతో వాహనదారులకు ఇక్కట్లు

◆ పోలీసుల సూచనలు పాటించని రైతులు

**పెబ్బేరు, నవంబరు 28 ప్రభాతవార్త:** రైతులు ఆరుగాలం పండించిన పంటను ప్రభుత్వ నిర్దేశించిన తేమ శాతం కొరకు రోడ్లపై ఆరబోసుకుంటున్నారు. సూగూరు గ్రామం నుండి పెబ్బేరు పట్టణానికి వచ్చు దారిలో రోడ్డుకి ఇరువైపులా ధాన్యాన్ని ఆరబోశారు. ఈ విధంగా ఆరబోసిన ధాన్యం వాహనదారుల ప్రమాదాలకు కారణమవు తుంది. రోడ్లపై ధాన్యాన్ని ఆరబోయటం వాహనదారుల ప్రాణాలకు నేరుగా ప్రమాదం సంభవిస్తుందని, రాత్రి వేళల్లో ధాన్యం కుప్పలు గుర్తుపట్టలేక తీవ్రమైన ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్లపై ధాన్యం పోయకుండా ప్రత్యామ్నాయ ప్రదేశాలలో ఆరబెట్టుకోవాలని, రైతులు బాధ్యతతో వ్యవహరించాలని, ధాన్యం ఆరబెట్టడానికి ఇళ్ల వద్ద, పొలాల్లో ప్రత్యేక కల్లాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజల ప్రాణాలు కాపాడడం అందరి బాధ్యతని మీడియా ముఖంగా వివరించారు. ఇకనైనా సంబంధిత మండల పోలీస్ అధికారులు రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసిన రైతులకు ప్రమాదాలపై అవగాహన కల్పించి, ప్రమాదాల నివారణకు సహకరించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుచున్నారు. ఈ విషయాన్ని రెండో ఎస్ఐ దివ్య రెడ్డిని వివరణ కోరగా రైతులకు అవగాహన కల్పించి వెంటనే రోడ్ల పైన ఉన్న ధాన్యాన్ని తొలగిస్తామని వార్తా ప్రతినిధికి చరవాణి ద్వారా సమాచారం ఇచ్చారు.

## గొప్ప సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే

● వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



మహాత్మా జ్యోతి బాపూలే చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే

**వనపర్తి ప్రతినిధి, నవంబరు 28 ప్రభాతవార్త:** తన భార్య సావిత్రిభాయ్ పూలేతో కలిసి బాలికల కోసం దేశంలో మొదటి పాఠశాలను స్థాపించి మహిళలకు విద్యాబోధన చేసిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మ జ్యోతి బాపూలే అని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం పూలే వర్ధంతి సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వివక్షతను తొలగించి సామాజిక సమానత్వం కోసం ఉద్యమించిన సామాజిక కార్యకర్త, వ్యాపారవేత్త సంఘ సంస్కర్త పూలే అని అన్నారు. దళిత వర్గాల అభివృద్ధి, సాధికారత కోసం ముందుకు తీసుకువచ్చి మహిళలకు కూడా విద్య అందించాల్సిన అవసరాన్ని ఉందనితన సతీమణి సావిత్రిభాయ్‌తో విద్యాభ్యాసం చేయించిన గొప్ప వ్యక్తి అని గుర్తుచేశారు. కార్యక్రమంలో వనపర్తి యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వాకిటి ఆదిత్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి.కృష్ణ, పట్టణ మాజీ కౌన్సిలర్లు చీర్ల సత్యం, వెంకటేష్, మధుగౌడ్, యాదగిరి, శరవంద, విభూది నారాయణ, వినోద్‌గౌడ్, బొంబాయి మన్నెకొండ, పరుశురాం, నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్ ఎస్టి, ఎస్సి, బిసి, మైనార్టీ నాయకులు యువకులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలకు మంత్రికి ఆహ్వానం



మంత్రి వాకిటి శ్రీహరికి జాతర ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ ధర్మకర్తలు

**మక్తల్ టౌన్, నవంబరు 28 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలో ఈ నెల 30 నుండి ప్రారంభం కానున్న పడమటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి మక్తల్‌లో తన స్వగృహం నందు ఆహ్వాన పత్రికను ఆలయ ధర్మకర్తలు అందజేశారు.

## నామినేషన్ వేసిన అభ్యర్థుల డిక్లరేషన్ తప్పనిసరి

◆ గద్వాల జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్



నామినేషన్ కేంద్రంలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల టౌన్ నవంబర్ 28, ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో నామినేషన్ వేసిన అభ్యర్థుల నుంచి డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. శుక్రవారం గద్వాల మండలం శెట్టి ఆత్మకూరు గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ కేంద్రంలో ఆత్మకూర్ తో పాటు సంగాల, గోనుపాడు, మదనపల్లి, ఈడిగోనిపల్లి గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్లను కూడా స్వీకరిస్తుండడంతో ఆయా పంచాయతీల ఓటర్ లిస్టును కలెక్టర్ పరిశీలించారు. ఓటరు జాబితాలో పోటీ చేసేందుకు నామినేషన్ వేసేఅభ్యర్థుల క్రమసంఖ్య, ఇతర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నామినేషన్ పత్రా ల్లో నమోదు చేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్ వేసే ఆయా వర్గాల అభ్యర్థులతో నిర్దేశించిన డిపాజిట్ మాత్రమే తీసుకొని తగిన రసీదును అందజే యాలన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థుల నుంచి రిట ర్నింగ్ అధికారులు దరఖాస్తులను స్వీకరించే విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా పంచాయతీ సర్పంచి, వార్డు స్థానాలకు కేటాయించిన రిజర్వేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, వ్యయముల ఖాతా నిర్వహణ, తదితర ఫారాలను అవసరమైన మేరకు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎన్నికల ఖర్చుల లెక్కల నిర్వహణపై అభ్యర్థి దాఖలు చేయాల్సిన డిక్లరేషన్ ఫారాలపై అన్ని అంశాలను తప్పనిసరిగా రాసేలా అవగాహన కలిగించాలన్నారు. నామినేషన్ దాఖలు చేసిన వారి వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్లో నమోదు చేయాలని, కేటాయించిన విధుల్లో అలసత్వం వహించే వారిపై తగిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ఈ పర్యటనలో జిల్లా ఎన్నికల జనరల్ పరిశీలకులు గంగాధర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతికపరంగా అనేక మార్పులు

● విద్యార్థులు సైన్స్‌ను అందిపుచ్చుకుని కొత్త ఆలోచనలకు పదును పెట్టాలి

● కొత్త ఆవిష్కరణల ద్వారా ప్రతి రంగం అభివృద్ధి

● వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

● చిట్యాల గురుకుల పాఠశాలలో 53వ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన



వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, నవంబరు28 ప్రభాతవార్త:** రోజురోజుకు సాంకేతికపరంగా అనేక మార్పులు వస్తున్నాయని, వాటికి అనుగుణంగా విద్యార్థులు సైన్స్‌ను అందిపుచ్చుకుని కొత్త ఆలోచనలకు పదును పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. శుక్రవారం వనపర్తి మండలం చిట్యాలలో ఉన్న ప్రభుత్వ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న 53వ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన 2025,26 ఇన్‌స్పైర్ అవార్డ్స్ 2024,25 కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో విద్యార్థుల్లో లాజికల్ థింకింగ్ పెంచడం కోసం సైన్స్ ఉపాధ్యాయుల ద్వారా ప్రత్యేకంగా పుస్తకాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా ఆ పుస్తకాన్ని కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం వైజ్ఞానిక ప్రదర్శనలను కలెక్టర్ ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమానికి 150పాఠశాలల నుండి విద్యార్థులు హాజరవుతున్నారు. మొత్తం 270 వైజ్ఞానిక ప్రజలు ఇక్కడ ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచి కొత్త కొత్త ఆలోచనలపై దృష్టి సారించి సాంకేతిక రంగంలో ఎదగాలన్నారు. రోజురోజుకు సాంకేతిక పరంగా అనేక మార్పులు వస్తున్నాయని, వాటికి అనుగుణంగా కొత్త ఆలోచనలకు పదును పెట్టాలన్నారు. సైన్స్ అంటేనే నిజం అని, సైన్స్ ద్వారా ప్రపంచంలో ప్రకృతిలో దాగి ఉన్న నిజాలను తెలుసుకోవచ్చని చెప్పారు. సైన్స్‌ను అలవర్చుకుంటే జీవితంలో ముందుకు వెళ్ళగలమని చెప్పారు. ఈ రోజు మనం ఇక్కడినుండే ఇతర గ్రహాలపైన డ్రోన్లను ఆపరేట్ చేయగలుగుతున్నామని అంతగా సాంకేతికత అభివృద్ధి చెందిందని తెలిపారు. సైన్స్ పై ఆసక్తి పెట్టి విద్యార్థులు పరిశోధనాత్మక విధానంలో ప్రతి విషయాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. సమాజంలోని సమస్యల పరిష్కారానికి మార్గం సైన్స్ చూపిస్తుందని, అది సృజనాత్మక ఆలోచనలతోనే సాధ్యమవుతుందని కలెక్టర్ అన్నారు. సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతుందని, ఈ నేపథ్యంలో కొత్త ఆవిష్కరణల ద్వారా ప్రతీ రంగం అభివృద్ధి అంచెలంచెలుగా జరుగుతుందన్నారు. ప్రపంచం ఆధునిక సాంకేతికత వైపు పరుగెడుతుందని, విద్యార్థులు సైన్స్‌లో ప్రతీ అంశాన్ని క్షుణంగా అధ్యయనం చేసి తెలుసు కోవాలని సూచించారు. కలెక్టర్ విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్‌ను పరిశీలించి వాటికి సంబంధించి ప్రశ్నలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కోసం కలెక్టర్ చేస్తున్న కృషిని వివరిస్తూ చేస్తున్న కృషిని వివరిస్తూ విద్యాశాఖ వివరిస్తూ అధికారులు కలెక్టర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, తహసిల్దార్ రమేష్ రెడ్డి, జిసిడిఓ శుభలక్ష్మి, చిట్యాల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ప్రశాంతి, ఇతర విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్



కలెక్టర్‌ను సన్మానిస్తున్న గురుకుల ఉపాధ్యాయులు

## అభ్యర్థుల ఎంపికలో తర్జనభర్జనలు

◆ అధికారపక్షంలో సర్పంచ్ ఆశావాహుల సంఖ్య అధికం

◆ కొలిక్కిరాని అభ్యర్థుల ఎంపిక ◆ గ్రామాలలో ఏకాభిప్రాయంతో రండి..

◆ వేచి చూసే ధోరణిలో ప్రతిపక్షాలు...



కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**చిన్న చింతకుంట, నవంబరు 28 ప్రభాతవార్త :** స్థానిక ఎన్నికల గాను రాష్ట్ర ఎన్నికల సంఘం సైరన్ మోగించడంతో గ్రామాలలో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల ఎంపికలో ఆయా పార్టీలు తర్జన భర్జనలు పడుతున్నారు. అధికార పక్షంలో సర్పంచ్ కు ఆశావాహుల సంఖ్య అధికంగా ఉండడంతో ఏకాభిప్రాయం కుదరడం లేదు. శుక్రవారం దమగ్నాపురంలోని తన స్వగృహంలో ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ఆయా గ్రామాల కాంగ్రెస్ శ్రేణులతో సర్పంచ్ అభ్యర్థుల ఎంపిక చేపట్టారు. మెజార్టీ గ్రామాలలో సర్పంచ్ కు పోటీ చేసే ఆశావాహులు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో ఎటు తేల్చుకోలేక ఇబ్బందులు పడ్డారు. పార్టీలో ఏకాభిప్రాయంతో రావాలని, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని ఆయన సూచించారు. ఒక్కో గ్రామం నుంచి ఒకటి నుంచి ఎక్కువ సంఖ్యలో సర్పంచ్ కు పోటీ చేసే ఆశావాహుల పేర్లు రావడంతో అభ్యర్థుల ఎంపిక సాధ్యం కాలేదు. సాయంత్రం ఆయా గ్రామాల్లోని కార్యకర్తల సమావేశంలో చర్చించి సమర్థుడు, ప్రజల్లో మంచి పేరు ఉన్న వ్యక్తిని ఎంపిక చేసిన పేరును తీసుకురావాలని ఆయా గ్రామాల పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే సూచించారు. గ్రామాలలో అధికంగాఉన్న సామాజిక వర్గాలను దృష్టిలో ఉంచుకొని అభ్యర్థుల ఎంపిక చేయనున్నారు. కురుమూర్తి, పల్లమర్రి గ్రామాల సర్పంచ్ అభ్యర్థులను అధికారపక్షం పేర్లను ఎంపిక చేసింది. అధికార పక్షం నుంచి కురుమూర్తి గ్రామ సర్పంచ్‌గా ఏటవుతల కురుమన్న, పల్లమర్రి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా సుజాత పేర్లను ఎమ్మెల్యేఖరారు చేశారు. ప్రతిపక్షాలు తమ సర్పంచ్ అభ్యర్థుల పేర్లను ఎంపిక చేసేందుకు కసరత్తును ముమ్మరం చేశారు. స్థానిక బరిలో నిలిచే అభ్యర్థుల పేర్లు అధికార పార్టీ ప్రకటించిన వెంటనే తమ అభ్యర్థుల పేర్లు ప్రకటించాలని వేచి చూస్తున్నారు. రేపటి వరకు సర్పంచ్ అభ్యర్థుల పేర్లు పూర్తిస్థాయిలో వెల్లడి కావచ్చని తెలుస్తుంది.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

● రైతులకు ఇబ్బంది లేకుండా చూడండి

● అధికారులను ఆదేశించిన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 28 ప్రభాతవార్త:** రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా కొనసాగించాలని సంబంధిత అధికారులను రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి కొనుగోలు ఏజెన్సీలతో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్ నాయక్ వెబెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 6376 మంది రైతుల నుంచి 35319 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 39కోట్ల రూపాయలు 2860 మంది రైతుల అకౌంట్లలో జమ చేసినట్లు తెలిపారు. సన్నబియ్యం బోనస్‌గా ఇప్పటి వరకు 78మంది రైతులకు 21.67 లక్షలు రూపాయలు ఖాతాల్లో జమ అయినట్లు తెలిపారు. ఇంకా రెండు, మూడు రోజుల్లో మొత్తం 991 మంది రైతులకు బోనస్ గా 2.94 కోట్ల రూపాయలు జమ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు ధాన్యం కొనుగోలు కార్యకలాపాలపై సమగ్ర సమీక్ష చేసి, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల(పిపిసి) ఇంచార్జ్‌లు టాబ్ ఎంట్రీలను తక్షణం పూర్తి చేయాలని, టాబ్ ఎంట్రీలు వేగంగా జరగడం ద్వారా రైతుల బ్యాంకుఖాతాల్లో మద్దతు ధర 2,3 రోజుల్లో జమయ్యేలా తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గన్నీ బ్యాగుల కోసం అవసరమైన ఇండెంట్లను ముందుగానే పంపించి, బ్యాగుల సరఫరాను సమయానికి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. గన్నీ బ్యాగులకు సంబంధించిన ఖాతాలను పూర్తిస్థాయిలో సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఏవైనా తేడాలు గమనించినట్లయితే సంబంధిత పిపిసి ఇంచార్జ్‌లపై చర్యలు తీసుకోవడంతో -మిగతా4లో..



వెబెక్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

## ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు

● నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



సీఎం పర్యటన సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

**మక్తల్ టౌన్ నవంబరు28 ప్రభాతవార్త:** డిసెంబర్ 1న నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ డా. వినీత్ భద్రతా ఏర్పాట్లను పోలీసు అధికారులు, మున్సిపల్ అధికారులతో పరిశీలించి సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మక్తల్ పట్టణ కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మైదానంలో పబ్లిక్ మీటింగ్ సమావేశ స్థలం, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించి, బందోబస్తుకు సంబంధించిన రూట్ మ్యాప్ ఏర్పాటు చేయాలని, బందోబస్తును సెక్టార్లుగా విభజించి తగిన భద్రత చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించామని తెలిపారు. సమావేశ స్థలంలో ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయబడుతుందని చెప్పారు. మీటింగ్ స్థలంలో, హెలిప్యాడ్ స్థలం వద్ద బారికేడ్స్ తదితర ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లా పోలీసుతో పాటు ఇతర జిల్లాల నుండి వచ్చే పోలీసు ఫోర్స్‌తో బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. పార్కింగ్ ప్రాంతాలను ప్రజలు, వీఐపీల వాహనాల కోసం విడివిడిగా గుర్తించి ట్రాఫిక్‌కు ఇబ్బందులు రాకుండా ప్రత్యేక ట్రాఫిక్ ప్లాన్ అమలు చేస్తున్నామని వివరించారు. ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఎస్పీతో పాటు డిఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ రామ్ లాల్, మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్, ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నూతన డిసిసి అధ్యక్షుడికి జిల్లా క్లబ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 28 ప్రభాతవార్త :** నూతన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమితులైన జిల్లా క్లబ్ కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్‌కు శుక్రవారం జిల్లా క్లబ్‌లో ఘనంగా సన్మానం చేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సంజీవ్ ముదిరాజ్ డీసిసి అధ్యక్షుడిగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా క్లబ్ అధ్యక్షులు నాగేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులు సీమ నరేందర్, సంయుక్త కార్యదర్శులు శంకర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కోశాధికారి రామచంద్రారెడ్డి, ఈసి మెంబర్‌లు నరేష్ రెడ్డి, మోహన్ రెడ్డి, ధ్రువ బాదిమి, ఆంజనేయులు, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## ఎన్నికలు సజావుగా జరగడానికి

# రాజకీయ పార్టీలు సహకరించాలి

**అమరచింత నవంబర్ 28, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న గ్రామ సర్పంచ్ ఎన్నికలను సజావుగా జరగడానికి రాజకీయ పార్టీలు సహకరించాలని మండల ఎంపీడీవో, శ్రీనివాసులు, తహసిల్దార్ రవికుమార్ వివిధ రాజకీయ పార్టీల నాయకులను కోరారు. శుక్రవారం అమరచింత ఎంపీడీవో కార్యాలయంలో వివిధ రాజకీయ నాయకుల పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరచింత



ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల సమావేశం

మండలంలోని రెండో విడతలో 14 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయని వారు అన్నారు. అలాగే మండలంలోని పామిరెడ్డి పల్లె, సింగంపేట, మస్తీపూర్, నందిమల్ల గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామని వారు తెలిపారు. అలాగే ఈ నెల 30వ తేదీ నుండి నామినేషన్ కార్యక్రమం ప్రారంభమవుతుందని వారు తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆయా గ్రామాల రాజకీయ పార్టీల నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై, స్వాతి, ఎం పి ఓ నరసింహులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, వివిధ రాజకీయ నాయకుల పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీలోకి చేరికలు

### కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించిన బాసు హనుమంతు నాయుడు

**గద్వాల టౌన్,నవంబర్ 28, ప్రభాతవార్త:** గద్వాల నియోజకవర్గం గట్టు మండలం బల్గెర గ్రామంలో మిట్టదొడ్డి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బిఆర్ఎస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా వారికి గద్వాల నియోజక వర్గ బిఆర్ యస్ పార్టీ ఇంచార్జ్ బాసు హనుమంతు నాయుడు పార్టీ కండువా కప్పి,పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న బాసు హనుమంతు

మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ బలపరి చిన అభ్యర్థుల గెలుపుకు ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో ఉప్పరి నరసింహులు,తిరుమలేష్,ఉప్పరి సిదన్న,ఉప్పరి శేషు, రవి,ఉప్పరి రాజు,సత్యారెడ్డి,ఉప్పరి ఉరుకుందు,వెంకటేష్,వీరేష్,చిన్న,ఉరుకుందు,పాగుంట తదిత రులు చేరారు. ఈ కార్యక్రమంలో రాజు నాయుడు,వీరయ్య శెట్టి,నాగన్న గౌడ్,ఉరుకుందు శెట్టి,మోనేష్,వీరేష్ నాయుడు,తెల్లయ్య, శేషు,నారాయణ,ఉరుకుందు,ప్రసింగిగ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ బి.నర్సింగ్‌రావు

**గద్వాల టౌన్ నవంబర్ 28, ప్రభాతవార్త:** గద్వాల మండలంలోని పరమాల గ్రామపంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు సందర్శించారు. రెండవ సాధారణ స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా సర్పంచ్, వార్డ్ సభ్యుల నామినేషన్ స్వీకరణ కేంద్రంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లను ఆయన వివరణాత్మకంగా పరిశీలించారు. నామినేషన్ హాల్,అభ్యర్థుల సౌకర్యాల ఏర్పాట్లు,పత్రాల స్వీకరణ , పరిశీలన విభాగాలు,భద్రతా చర్య



వివిధ ఎన్నికల పత్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

లు,సీసీ కెమెరాల వ్యవస్థ వంటి ముఖ్య అంశాలను ఆయన సమీక్షి ంచారు. నామినేషన్ ప్రక్రియ పారదర్శకంగా,క్రమశిక్షణతో, నిబంధనలకు అనుగుణంగా సాగేందుకు అవసరమైన మార్గదర్శకాల ను అధికారులు పాటిస్తున్నారా అనే విషయాన్ని కూడా ఆయన పరిశీలించారు.అధికారులతో మాట్లాడిన అదనపు కలెక్టర్ నామినేషన్ స్వీకరణను పూర్తిగా నిష్పాక్షి కంగా నిర్వహించాలని,అ భ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వాతావరణాన్ని సక్రమంగా ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ఎన్నికల శాఖ సిబ్బంది, పోలీసు శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి చెకుముఖి టాలెంట్ టెస్ట్‌లో ఎంపిక

**గద్వాల టౌన్ నవంబర్ 28, ప్రభాతవార్త :**అలంపూర్ మాంటిస్సోరి పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న పలువురు విద్యార్థులు, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముఖి టాలెంట్ టెస్ట్ పోటీల్లో తమ ప్రతిభను చాటుకుని రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారు అని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థులు గద్వాలలో ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి పోటీల్లోనూ ప్రతిభా



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటో అందజేస్తున్న దృశ్యం


ప్రదర్శన చేసి, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. ఎనిమిదవ తరగతి విద్యార్థి రిత్విక్, తొమ్మిదవ తరగతి విద్యార్థి అఖిల్ వంశీ, పదవ తరగతి విద్యార్థి సూరజ్ తమ తమ విభాగాలలో మెరుగైన ఫలితాలు సాధించారని తెలిపారు.ఈ ముగ్గురు విద్యార్థులు డిసెంబర్ నెలలో కరీంనగర్ జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి చెకుముఖి టాలెంట్ టెస్ట్ పోటీలలో పాల్గొననున్నారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కె. యన్. వి. రవి ప్రకాశ్ మాట్లాడుతూ, ఇలాంటి పోటీలలో చిన్న వయసు నుంచే విద్యార్థులను పాల్గొననించడం ద్వారా సృజనాత్మకత, విశ్లేషణా దక్షత, ఆత్మవిశ్వాసం మరింత పెంపొందుతాయని పేర్కొన్నారు.

# సమస్యాత్మక గ్రామాలలో ప్రత్యేక నిఘా

**వంగూరు, నవంబర్ 28 ప్రభాతవార్త:**పంచాయితీ ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఆయా గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టేందుకు తహసిల్దార్ మురళీమోహన్, ఎస్ఐ. మహేష్‌లతో కలిసి సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకున్నట్లు ఎంపీడీవో బ్రహ్మాచారి తెలిపారు. మొదటి విడత ఎన్నికల సందర్భంగా వంగూరు మండలంలో 2వ రోజు సర్పంచ్ అభ్యర్థులు 86 మంది నామినేషన్ దాఖలు చేయగా 46 మంది వార్డు సభ్యులుగా నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు. ఎన్నికల నిర్వహిస్తున్న సమయంలో ఎలాంటి ప్రలోభాలకు ప్రజలను గురి చేయకుండా ఎలాంటి ఒడిదుడుకులు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఎన్నికల నిర్వహణను సజావుగా నిర్వహించుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన సూచించారు.

# విద్యార్థులకు లైబ్రరీ పుస్తకాలు, నోట్ బుక్స్, పెన్నుల పంపిణీ

**ఊర్కొండ, నవంబర్ 28 ప్రభాతవార్త:**అవోప కల్వకుర్తి యూనిట్ ఆధ్వర్యంలో కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఊరుకొండపేట మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం విద్యాభివృద్ధి దిశగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రాంరెడ్డిపల్లి వాస్తవ్యులు కలిమిచర్ల గోపాల్ సహకారంతో పాఠశాల విద్యార్థులకు లైబ్రరీ పుస్తకాలు, నోటుబుక్స్, పెన్నులు, అదే విధంగా అంగన్వాడి బాలబాలికలకు పలకలను పంపిణీ చేశారు. ఈ సందర్భం



విద్యార్థులకు నోటు బుక్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

గా అధ్యక్షులు కలిమిచర్ల రాఘవేందర్, దాత కలిమిచర్ల గోపాల్‌లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యా వనరులను మరింతగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అవోప ప్రధాన కార్యదర్శి యాద శోభన్ బాబు, ఆర్థిక కార్యదర్శి కల్వ ఆంజనేయులు, సీనియర్ సభ్యులు వీరబొమ్మ గౌరయ్య, పోల రాజేంద్రప్రసాద్, ఈసి సభ్యుడు పాపిశెట్టి నరేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్వాడీ, కార్యకర్త విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జ్యోతి రావు పూలే వర్ధంతి వేడుకలు

**ఉప్పునుంతల, నవంబరు 28 ప్రభాతవార్త :** విద్యావ్యాప్తికి కృషి చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే 135 వర్ధంతి వేడుకలు మండలంలో ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల ప్రాథమిక బాలుర పాఠశాలలో మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు గాజుల వెంకటేష్, చందన, సంగీతలు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే అందరికీ విద్యను అందించడానికి తన సతీమణి సావిత్రిబాయికి చదువు నేర్పి, ఆమె తో కలిసి 1848 సంవత్సరం నుంచి బాలికల కోసం, సమాజంలోని సంపన్న వర్గాల కోసం స్వాతంత్రానికి ముందు 52 పాఠశాలలు స్థాపించి ఎన్ని అవమానాలను, అడ్డంకులను, కుట్రలను ఎదుర్కొని విద్యావ్యాప్తికి కృషిచేసిన విద్యావేత్త అని వారు 1873 సంవత్సరంలో సత్యశోధక సమాజ్ ను స్థాపించి లింగ వివక్షతకు, కుల వివక్షతకు, సమాజంలోని అసమానతలకు, బాల్య వివాహాలకు, సతీసహగమనంకు ,మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేసిన సామాజిక విప్లవకారులు అన్నారు. గులాంగిరి పుస్తకం రచించి అత్యధిక ప్రజలు, మానసిక బానిసత్వం నుంచి విముక్తికావాలని అందుకు విద్యను ఆయుధంగా తీసుకోవాలన్నారు.వారిఆశయాల సాధనకోసం అందరం విచ్చేయాలని,వారి స్పూర్తిని తీసుకొని విద్యార్థులు చదువుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు.



ఉప్పునుంతల బాలుర పాఠశాలలో ఘనంగా నివాళులు

### బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే

**అమరచింత నవంబర్ 28, ప్రభాతవార్త:** బడుగు బలహీన వర్గాల హక్కుల సాధనకై నిరంతరం పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావు పూలేనని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు, అజయ్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు, శ్యాంసుందర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు, రాఘవేంద్ర, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, ఎస్ రాజు అన్నారు. జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం అమరచింత మండల కేంద్రంలోని బస్టాండ్ లో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళి అర్పించారు. దేశంలో కుల మతాలకు అతీతంగా ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని సహపంతి భోజనములో దళితులను భాగస్వామ్యం చేసిన ఘనత జ్యోతిరావు పూలేదేనని ఆయన అన్నారు. నేటి యువత జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. విజయ్, సామ్సన్, రవి, నేపాల్, వెంకటేష్, విష్ణు, ఆశి రెడ్డి, కర్ణాకర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి

**పెబ్బేర్, నవంబరు 28 ప్రభాతవార్త :** పెబ్బేర్ పట్టణంలో మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్పిటల్ ఎదురుగా ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు



ఘనంగా జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు



జ్యోతిరావు పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు

అర్పించారు.సంఘం సభ్యులు మాట్లాడుతూ కులవివక్షతను తొలగించి సామాజిక సమానత్వం కోసం ఉద్యమించిన సామాజిక కార్యకర్త,వ్యాపారవేత్త, సంఘ సంస్కర్త పులే అన్నారు దళిత వర్గాల అభివృద్ధి సాధికారత కోసం ముందుకు తీసుకొచ్చి మహిళలకు కూడా విద్య అందించాల్సిన అవసరం ఉందని తన సతీమణి సావిత్రిబాయి పూలతో విద్యాభ్యాసం చేయించిన గొప్ప వ్యక్తి పూలే అని కొనియాడారు.ఈకార్యక్రమంలో గోల్డ్ బాలస్వామి, సహదేవుడు,భీముడు, కురుమూర్తి,సొప్పరి బీచ్ పల్లి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీట్లు పెంచాలి

**గద్వాల టౌన్ నవంబర్ 28, ప్రభాతవార్త:** గద్వాలలో వున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీట్లను 150 సీట్ల వరకు పెంచాలని విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాల వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ కళాశాల సమస్యల వలయంగా వుందని,ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు, లేక మెడికల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న మెడికల్ కళాశాలు, మహబూబ్నగర్ మెడికల్ కళాశాలకు 220 సీట్లు,నాగర్‌కర్నూల్ మెడికల్ కళాశాలకు 150, వనపర్తి మెడికల్ కళాశాలకు 150 సీట్లు కేటాయించి నడిగడ్డ ప్రాంతమైన గద్వాలకు కేవలం 50 సీట్లకే పరిమితం చేశారనీ అన్నారు. ఇక్కడున్న పాలకులు ఇక్కడి ప్రజలపై ఎలాంటి వివక్ష చూపుతున్నారో దీన్ని బట్టి అర్థమవుతుందన్నారు. ప్రస్తుతం విద్యార్థినీలు 64,



మెడికల్ కళాశాల దగ్గర నిరసన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బాలుర విద్యార్థులు 36 మంది ఉన్నప్పటికీ వారికి సరైన వసతి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు అన్నారు. రాష్ట్రంలో మెడికల్ కళాశాలకు ప్రభుత్వమే బస్సులు కేటాయించినప్పటికీ గద్వాల్ లో ఉన్న మెడికల్ కాలేజీకి ఇంతవరకు బస్సులు కేటాయించలేదంటే నడిగడ్డ ప్రాంతం అంటే ఎందుకు ఇంత చిన్నచూపు అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు. శంకర ప్రభాకర్, సుభాన్, బీరెల్లి దానయ్య, జమ్మిచేడు కార్తీక్, నాగన్న, గోపాల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం : రామాంజనేయులు

**గద్వాల టౌన్ నవంబర్ 28, ప్రభాతవార్త:** గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని, గ్రామల అభివృద్ధి బీజేపీ తోనే సాధ్యమవుందని, అందుకే గ్రామ సర్పంచులను బీజేపీ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించండనీ బీజేపీ జిల్లా అధ్యక్షులు టి. రామాంజనేయులు అన్నారు.జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో, అయిజ మండల అధ్యక్షులు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో, సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి జిల్లా బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ ఎస్.రామచంద్రారెడ్డి అధ్యక్షత వహించగా, జిల్లా అధ్యక్షులు టపాల రామాంజనేయులు ముఖ్య అతిథిగా..పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ...తెలంగాణలో బీజేపీ చేసిన అభివృద్ధి, గ్రామాల్లో కనిపి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

స్తుందని, ప్రధాన మంత్రి మోదీ నాయకత్వంలో గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో పనులు చేసిందన్నీ,ఇవి ప్రజల ఇంటి వద్దకే చేరాయన్నారు.ప్రతి ఇంటికి ఉచిత గ్యాస్ కనెక్షన్ – ఉజ్వల యోజనతో లక్షలాది మహిళలకు ఉపశమనం అన్నారు. ఉచిత ఇళ్ల ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన ద్వారా పేదలకు గౌరవ నివాసం,ఉచిత ఆరోగ్య సేవలు ఆయుష్మాన్ భారత్‌తో రూ.5 లక్షల ఆరోగ్య బీమా,వృద్ధులకు, రైతులకు, దివ్యాంగులకు నేరుగా డబ్బు జమ పీఎం కిసాన్, పీఎం జనసేవా పథకాలు ఇలా ఎన్నో పథకాలు గ్రామీణ ప్రజల కోసం బీజేపీ ప్రవేశపెట్టింది అన్నారు.గ్రామాల్లో రోడ్లు, కాల్వలు, తాగునీటికి భారీ నిధులు గ్రామీణ అభివృద్ధి కోసం ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టింది అన్నారు.జనఔషధ కేంద్రాలతో చౌకగా మందులను పేద కుటుంబాలకు అందిస్తూ ఆరోగ్య భరోసా కల్పించింది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని పూర్తిగా నిరక్ష ్యం చేస్తోందనీ,కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను కూడా సరైన రీతిలో వినియోగిం చడంలో విఫలమైందన్నారు.నిజమైన అభివృద్ధి కావాలంటే బీజేపీకే అవకాశం ఇవ్వాలనీ, రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అయిజ పట్టణ అధ్యక్షులు కంపాటి భగత్ రెడ్డి, అయిజ పట్టణ ఉపాధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్, రాజశేఖర్, అంజి, నాగరాజు, శివన్న, గోపాల్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో మెజారిటీ సర్పంచ్ స్థానాలు గెలవాలి

### జిల్లా బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల కన్వినర్ ఎస్.రామచంద్రారెడ్డి

**వడ్డేపల్లి,నవంబరు 28 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల కేంద్రం శాంతినగర్ పట్టణంలో సర్పంచ్ స్థానిక సంస్థల ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం వడ్డేపల్లి మండల బిజెపి అధ్యక్షులు బోయనాగరాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా మాజీ అధ్యక్షులు రామచంద్ర రెడ్డి, అల్లంపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి రాజగోపాల్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచ్ ఎన్నికలలో ఓట్లు నైతిక హక్కు భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు మాత్రమే ఉందన్నారు. గ్రామపంచాయతీలకు ఎక్కువ మొత్తంలో నిధులు మొత్తం కేంద్ర ప్రభుత్వం నుండే వస్తున్నాయన్నారు. దాంట్లో భాగంగా రేషన్ బియ్యం ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా రోడ్ల మార్గాలు మరుగుదొడ్ల నిర్మాణం ప్రధానమంత్రి గ్రామీణ ఇండ్ల నిర్మాణానికి అత్యధిక



మాట్లాడుతున్న బిజెపి నాయకులు

మొత్తంలో కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. అలాగే రాబోయేటువంటి సర్పంచ్ ఎన్నికలలో బిజెపి అభ్యర్థులను గెలిపిస్తే కేంద్రం నుంచి అధిక మొత్తంలో నిధులు తీసుకురావడానికి అవకాశం ఉంటుందన్నారు. అలాగే సర్పంచ్ అభ్యర్థులను బిజెపి పార్టీ అభ్యర్థులను మాత్రమే గెలిపించాలని కోరారు. ప్రతి ఒక్కరూ బీజేపీ కార్యకర్త పోటీలలో పాల్గొనేలా విజయం దిశగా అడుగులు వేయాలని కోరారు. అందుకు ఎంపి డికె అరుణమ్మ సహకారం ఇప్పటికి ఉంటుందని జిల్లా నాయకుల సహకారం ఉంటుందని అవసరమైతే అన్ని విధాలుగా ప్రచారంలో పాల్గొని బిజెపి కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. బిజెపి కార్యకర్తలు ధైర్యంగా ఎన్నికలలో పాల్గొనాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ ఒకటికి రెండుసార్లు పరిశీలించిన పిదప నామినేషన్ పత్రాలు ఎన్నికల సంఘానికి సమర్పించాలన్నారు. దానికి సంబంధించినటువంటి అన్ని విషయాల గురించి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్ గౌడ్, మాజీ మండల అధ్యక్షులు నరసింహ, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, తనగల రవి గౌడు, నరేష్, రాఘవేంద్ర, మండల యువ మోర్చా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రకాశం, రంగస్వామి, రాజు, గౌడ్డొలప్ప గౌడు, పరమేష్ గౌడ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలు, అధికారులు ఏకం... రైతులకు పంగనామం

### బీసీ పొలిటికల్ జెఏసి చైర్మన్ డా. రాచాల యుగంధర్ గౌడ్

**పెబ్బేరు, నవంబరు 28 ప్రభాతవార్త :** ప్రభుత్వ పెద్దలు రైతులను రాజులను చేస్తామని చెబుతారు. కాని ఆరుగాలం శ్రమించిన పంటను కొనకుండా ఎండలో కూర్చోబెట్టి వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ డా. రాచాల యుగంధర్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన పెబ్బేరు మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రంలో రైతుల కల్లాలను, తూకాలను పరిశీలించి మాట్లాడారు. కొందరివి ఇన్ని రోజులకు తూకాలు అవుతుంటే రైతులను అమాయకులను చేసి 43,42 కిలోలు తూకం చేస్తున్నారని ఈ విషయమై సివిల్ సప్లయ్ డీఎంను విచారించగా 40 కిలోల 600 గ్రాములు మాత్రమే తూకం చేయాలని చెబుతున్నారని అన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీసీ పొలిటికల్ జెఏసి చైర్మన్ డా. రాచాల యుగంధర్ గౌడ్

కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, సివిల్ సప్లయ్ అధికారులు, మిల్లర్లు ప్రజాప్రతినిధులు రైతులను నిండా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఇక్కడ లారీల సమస్య కూడా ఉందని, ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్ట్ పద్ధతిలో లారీలు పంపిణీ చేయడం కోసం అనుమతి పొందిన వ్యక్తులతో నిజంగా లారీలు ఉంటే ఎందుకు ధాన్యం త్వరగా తరలించడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి నాయకులు వివి గౌడ్, దేవర శివ, వడ్డె రాజు, రమేష్ గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త పోటీ చేయాలి

### భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న యాట రామకృష్ణ

**జడ్చర్ల నవంబర్ 28, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ జడ్చర్ల మండలం పార్టీ ఆఫీస్‌లో స్థానిక సంస్థల ఎలక్షన్లలో గెలుపే లక్ష ్యంగా ప్రతి ఊరు నుండి బూతు అధ్యక్షులు మరియు గ్రామ అధ్యక్షులు ప్రతి ఒక్కరు ప్రతి గ్రామంలో వార్డు మెంబర్లుగా, సర్పంచ్‌గా ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త పోటీ చేయాలని మండల అధ్యక్షులు యాట రామకృష్ణ సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు రమేష్, మండల ప్రధాన కార్యదర్శి చక్కని మల్లేష్ యాదవ్ , ఓబిసి మండల అధ్యక్షులు శివకుమార్ యాదవ్ , కిసాన్ మోచన్ మండల అధ్యక్షులు బరిగల శ్రీశైలం ముదిరాజ్, గిరిజన మోర్చా మండల అధ్యక్షులు మోహన్ నాయక్, మండల ఉపాధ్యక్షులు కాశన్న ,బీజేవైఎం మండల అధ్యక్షులు గణేష్ గుప్తా, ఈశ్వర్, తిరుపతయ్య, రమేష్, జ్ఞానేశ్వర్, ముదిరాజ్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి క్రీడలకు ఆత్మకూరు విద్యార్థుల ఎంపిక

**ఆత్మకూర్ నవంబర్ 28, ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న శ్రీ దర్శన్, గణేష్ లు రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడలకు ఎంపికైనట్లుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలస్వామి విలేకరులకు తెలిపారు. ఈనెల 27న ఉమ్మడి జిల్లాలోని జడ్చర్ల పట్టణంలో జరిగిన జిల్లా స్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి డిసెంబరు ఒకటి నుండి మూడవ తేదీ వరకు ఖమ్మం జిల్లా కేంద్రంలో జరగనున్న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడలకు ఆత్మకూరు విద్యార్థులు ఎంపికైనట్లుగా ఆయన తెలిపారు. రాష్ట్ర స్థాయి కూలీలకు ఎంపికైన విద్యార్థులను ఆత్మకూర్ మండల విద్యాధికారి బాలరాజు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని సుమతి ఉపాధ్యాయ బృందం తదితరులు విద్యార్థులను ఘనంగా సన్మానించారు.

# బదిలీపై వెళ్తున్న బ్యాంక్ అధికారికి సన్మానం

**దేవరకద్ర,నవంబర్ 28 ప్రభాతవార్త:** బదిలీపై వెళ్తున్న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ క్యాషియర్‌ను బ్యాంక్ సిబ్బంది సన్మానించారు. కౌకుంట్ల తెలంగాణ గ్రామీణ బ్యాంక్ క్యాషియర్‌గా విధులు నిర్వహిస్తున్న నందు నిజామాబాద్‌కి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను బ్యాంక్ సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఉత్తమ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని, 12 నెలలుగా బ్యాంకులో అందరితో మమేకమై విశేష సేవలందించారని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ క్రాంతి కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ శ్రీనివాసులు, ఫీల్డ్ ఆఫీసర్ సాయికిరణ్, అటెండర్ శ్రీనివాసులు, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి చెకుముకి పోటీల్లో మోడల్ స్కూల్ పెబ్బేరుకు ప్రథమ స్థానం



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న డీఈవో

**పెబ్బేరు, నవంబరు 28 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా కేంద్రం యాదవ భవనంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో మోడల్ స్కూల్ పెబ్బేర్ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. విద్యార్థులు జోత్స్న, ధ్యాన్ అద్వైత్, హర్షితలను గైడ్ టీచర్‌గా వ్యవహరించిన ఫకీరయ్య ను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డా. తూర్పింటి నరేశ్ కుమార్ అభినందించారు. ఆయన మాట్లాడుతూ మా స్కూల్ విద్యార్థులు ఏ పోటీ పరీక్షలు నిర్వహించిన ప్రతి మా స్థానంలో నిలుస్తున్నారని దీనికి ఉపాధ్యాయ బృందం కూడా వారికి పూర్తిగా సహకరిస్తుందని విజేతలుగా నిలిచిన విద్యార్థులను అలాగే ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ నరేష్ అభినందించారు.

## స్థానిక ఎన్నికలలో సిపిఐ పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి

**సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ రాములు**

**అమరచింత నవంబర్ 28, ప్రభాతవార్త:** జిల్లాలో సిపిఐ పార్టీ బలంగా ఉన్నచోట స్థానిక ఎన్నికలలో పోటీ చేయడానికి సన్నద్ధం కావాలని వనపర్తి జిల్లా సిపిఐ కార్యదర్శి, విజయ రాములు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం అమరచింత మండల కేంద్రంలోని సిపిఐ పార్టీ మండల కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిపిఐ పార్టీకి బలమున్న గ్రామాలలో సర్పంచ్, వార్డు మెంబర్లుగా పోటీ చేస్తున్నామని ఆయన తెలిపారు. సిపిఐ పార్టీ పోటీ లేనిచోట



సమావేశంలో మాట్లాడుతున్న వనపర్తి జిల్లా సిపిఐ కార్యదర్శి విజయరాములు

మిత్రపక్షమైన కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని ఆయన అన్నారు. వనపర్తి జిల్లాలో మొదటి విడతగా జరుగనున్న ఎన్నికలలో రేవల్లి, ఏదుల, గోపాల్పేట్, గన్ పూర్, పెద్దమందడి మండలాలలో నామినేషన్లు వేశామని అలాగే రెండో విడతలో జరగనున్న ఆత్మకూరు అమరచింత మండలాలలో సిపిఐ అభ్యర్థులు పోటీలో ఉంటారని ఆయన అన్నారు. సిపిఐ పార్టీ బలపరిచిన అభ్యర్థులను ప్రజలు ఆదరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి, అబ్రహం, రవీందర్, శ్యాంసుందర్, ఇజ్రాయిల్, గొల్ల రఘు, లక్ష్మీ     మ్మనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణంపై అవగాహన కార్యక్రమం

**పెద్దమందడి, నవంబరు 28 ప్రభాతవార్త :** ఆర్ఎస్ఎస్ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి చేసిన సందర్భంగా శుక్రవారం పెద్దమందడిలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ లో ప్రధాన మాతాజీ అరుణ ఆధ్వర్యంలో సప్తశక్తి సంఘం కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కుటుంబంలో మహిళ పాత్ర, పర్యావరణ పరిరక్షణ వంటి ముఖ్యాంశాలపై విశదీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వనపర్తి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి వారణాసి కల్పన, శ్వేతా హాజరయ్యారు. ఈ సందర్భంగా



సప్తశక్తి సంఘం కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

వారణాసి కల్పన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంస్థలు దేశ సమైక్యతకు రక్షణ కవచం లాంటివని భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి" అని అన్నారు. అలాగే "కుటుంబంలో స్త్రీ పాత్ర అత్యంత ముఖ్యమైనది. కుటుంబం బాగుంటేనే సమాజం, దేశం బాగుంటుంది" అని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతని హితవు పలికారు. అనంతరం స్వాతి మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే పిల్లల్లో సంస్కృతి-సాంప్రదాయాలపై అవగాహన పెంచాల్సిన అవసరాన్ని తెలియజేశారు. రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాల బోధన ద్వారా పిల్లలలో ఆధ్యాత్మిక విలువలు పెంపొందాలని అన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్ఐ

**అమరచింత నవంబర్ 28, ప్రభాతవార్త:** స్థానిక ఎన్నికలు గ్రామాలలో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై, స్వాతి కోరారు. శుక్రవారం అమరచింత మండల పరిధిలోని పామిరెడ్డి పల్లె, కొంకనివాని పల్లె గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ స్వాతి మాట్లాడుతూ, అమరచింత మండలంలోని రెండో విడతలో జరగనున్న సర్పంచ్ ఎన్నికల లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ స్వాతి

అన్నారు. మండలంలోని నందిమల్ల, సింగంపేట, పామిరెడ్డి పల్లె, మస్తిపూర్ గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించామని ఆమె అన్నారు. సమస్యాత్మక గ్రామాలలో ఎన్నికలలో ఎవరైనా ఆటంకం కలిగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల నామినేషన్ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ శ్రీనివాస రావు

**గద్వాల టౌన్, నవంబర్ 28, ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్లను దృష్టిలో ఉంచుకుని, గద్వాల్ మండలంలోని పరుమల గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రం ను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధుల్లో వున్న సిబ్బందితో ఎస్పీ మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ పూరిగా నిష్పక్షపాతంగా, శాంతియుతంగా జరగాలనీ, ఎలాంటి అవాంఛిత ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలనీ సూచించారు. ప్రజల



నామినేషన్ కేంద్రంలో పర్యటిస్తున్న ఎస్పీ శ్రీనివాస రావు

కు పారదర్శకమైన వాతావరణం కల్పించడం సిబ్బంది బాధ్యత అని చెప్పారు. ఎలక్షన్ ఉద్దేశించి మాట్లాడుతూ..ఎన్నికల్లో శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేదనీ, ఎన్నికల ప్రక్రియను భంగపరచాలని ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో సెన్సిటివ్ గ్రామాలపై ప్రత్యేక నిఘా, బందోబస్తు, పేట్రోలింగ్, క్విక్ రెస్పాన్స్ టీంలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అక్రమ డబ్బు, మద్యం పంపిణీ, బెదిరింపులు, ప్రలోభాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

## ఎన్నికల వేళ చెక్‌పోస్టులో పటిష్ట భద్రత ఏర్పాటు చేసిన అధికారులు

**అక్రమంగా డబ్బు, మద్యం రాష్ట్రంలోకి రాకుండా తనిఖీలు నిర్వహిస్తున్నాం : ఎస్ఐ ఎస్ఎం నవీద్**

**పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు**

**కృష్ణ, నవంబరు 28 ప్రభాతవార్త :** స్థానిక ఎన్నికల నేపథ్యంలో కృష్ణ చెక్‌పోస్టులో అధికారులు వాహనాలు, నగదు, మద్యం, ఓటర్లను ప్రభావితం చేసే వస్తువుల రవాణా, ఆయుధాలు మరియు అనుమానస్పద వ్యక్తులను మరింత దృష్టితో కఠినంగా తనిఖీ నిర్వహిస్తున్నారు. అధికారులు కృష్ణ ఎస్సై ఎస్ఎం నవీద్, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాస్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ ఏర్పాటు చేయాల్సిన ప్రాథమిక సౌకర్యాలు, భద్రతా చర్యలు, తాగునీరు, విద్యుత్,



చెక్ పోస్టును అప్రమత్తం చేస్తున్న ఎస్సై నవీద్

టాయిలెట్ సదుపాయాలు, ప్రహరీ గోడలు, వికలాంగులకు అవసరమైన సౌకర్యాలు తదితర అంశాలను గురించి గ్రామస్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు. మండలంలోని ప్రతి కేంద్రం వద్ద ఏర్పాటు పూర్తిగా ఉందో లేదో అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించారు. అలాగే కృష్ణ బోర్డర్ చెక్‌పోస్ట్ వద్ద ఉన్న పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించి అక్రమంగా జిల్లాలోకి డబ్బు మద్యం ఇతర విలువైన వస్తువులు రాకుండా తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్సై నవీద్ తెలిపారు. ఎన్నికలను పారదర్శకంగా ప్రశాంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ప్రజలు ఎలాంటి బెదిరింపు లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్నివిధాల భద్రతా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

# పంచాయతీ ఎన్నికల్లో పారా.. హుషార్..

**సందడిగా గ్రామాలు.... రేసుగుర్రాళ్ళ కోసం పార్టీల వేట**

**పోటీ రసవత్తరంగా మారే అవకాశం**

**కౌకుంట్ల మండలంలో 12 జీపీలు,106 వార్డులకు ఎన్నికలు**

**దేవరకద్ర, నవంబరు 28 ప్రభాతవార్త:** సుమారు ఏడేళ్ల తర్వాత నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఒకవైపు సర్పంచ్, వార్డ్ మెంబర్ల అభ్యర్థుల ఎంపికలకు నాయకులు కుస్తీలు పడుతున్నారు. అవకాశం వచ్చిందని కొందరు, రిజర్వేషన్ కల్సి వచ్చిందని మరికొందరు, చివరిసారి ప్రయత్నించాలని మాజీ ప్రజా ప్రతినిధులు తమ ఉబలాటాన్ని వ్యక్తపరుస్తుండగా, ఎలాగైనా ప్రయత్నించి ప్రజాప్రతినిధిగా నిలదొక్కుకోవాలని యువత స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దిగేందుకు పావులు కదుపుతున్నారు. రాష్ట్రంలో 2018లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలు 2023 డిసెంబర్ నెలలో పాలకవర్గం పదవి కాలం ముగిసింది. దీంతో అప్పటి నుండి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో, అన్ని గ్రామ పంచాయతీలలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. రిజర్వేషన్ పేరిట కొన్నాళ్లు, కోర్టుల పేరిట మరికొన్నాళ్లు, దాదాపు రెండేళ్లుగా రేపు మాపు సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ అంటూ ప్రజలను, నాయకులను, ఊగిసలాడించిన ఎన్నికల ప్రకటన ఎట్టకేలకు వెలువడడంతో సర్పంచ్ ఆశావాహు




గ్రామ పంచాయతీ కార్యాలయము

లు, అభ్యర్థులలో హుషారు నెలకొంది. రెండేళ్లుగా సర్పంచ్ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్న వారు ఆయా గ్రామాలలో అధికార ప్రతిపక్ష పార్టీ నుండి లేకుండా స్వతంత్ర అభ్యర్థిగానైనా బరిలో నిలిచి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఉత్సాహంగా పరుగులు పెడుతున్నారు. ఈ క్రమంలో భాగంగా కౌకుంట్ల మండల స్థాయిలో ఆయా పార్టీల నాయకులతో ఉన్న సంబంధాలను తమకు గ్రామాలలో ఉన్న ప్రజాబలాన్ని నిరూపించుకుంటూ పార్టీ నాయకుల ఆశీస్సుల కోసం ప్రయత్నించుకుంటున్నారు. ఎలాగైనా ఎన్నికల్లో గెలిపే ధ్యేయంగా ఓటర్ దేవుళ్లను ప్రసన్నం చేసుకునేందుకు నూతన మార్గాలు సైతం వెతుకుతున్నట్లు తెలుస్తుంది. పంచాయతీ పోరు రాజకీయ పక్షాలకు, గ్రామాల్లోని నేతలకు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారింది. దీంతో అన్ని పార్టీలు కూడా గెలుపు గుర్రాలను బరిలో దించేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నాయి. పంచాయతీ ఎన్నికలను రాజకీయ పార్టీలు సీరియస్‌గా తీసుకున్నాయి. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు చెందిన ముఖ్య నేతలు, గ్రామాల వారీగా నేతలతో మాట్లాడుతున్నారు. పోటీ తీవ్రంగా ఉన్నచోట అభ్యర్థులను అక్కడి నేతలతో మాట్లాడి, ఒకరిని పోటీలో నిలిపేందుకు మంతనాలు ప్రారంభించారు. ఖర్చులకు వెనుకాడని, ప్రజలలో మంచి పేరు ఉన్న నేతలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. పార్టీల ముఖ్య నేతలు నియోజకవర్గ కేంద్రాలలో మఖం వేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షి స్తున్నారు. కౌకుంట్ల మండలంలో 12 గ్రామపంచాయతీలలో 106 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

### 12 సర్పంచుల పదవులకు ఎన్నికలు...

జనాభా ప్రాతిపదికన సర్పంచులు, వార్డ్ మెంబర్లు, రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావాహులు తహతలాడుతున్నారు. కౌకుంట్ల మండలంలో రిజర్వేషన్లను ఒక్కసారి పరిశీలిస్తే...కౌకుంట్ల (బీసీ, జనరల్), ఇస్రంపల్లి (బీసీ,జనరల్), పుట్టపల్లి (బీసీ,జనరల్), రేకులంపల్లి (జనరల్), వెంకటగిరి (ఎస్సీ, జనరల్), పేరూరు (జనరల్), తిరుమలాపూర్ (బీసీ, మహిళ), ముచ్చింతల (జనరల్), అప్పంపల్లి (జనరల్, మహిళ), దాసర్ పల్లి (జనరల్, మహిళ), వెంకంపల్లి (జనరల్, మహిళ), రాజోలి (బిసి, మహిళ)లుగా రిజర్వు అయ్యాయి.

# గ్రామాలలో అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్

**ఎన్నికల సభలు ర్యాలీలకు అనుమతులు తీసుకోవాలి.. ఎన్నికల మండల నోడల్ అధికారి తాహసిల్దారు వీరభద్రప్ప**

**ఇటిక్యాల నవంబర్ 28,ప్రభాతవార్త:** మండల పరిధిలోని గ్రామాలలో జరిగే సర్పంచులు. వార్డ్ మెంబర్లకు సంబంధించి సభలు ర్యాలీలు చేపట్టేందుకు అనుమతులు తీసుకోవాలని అలాగే రాజకీయ పార్టీలకు సంబంధించిన పోస్టర్లు ఉండరాదని గోడలపై రాసేందుకు ఇంటి యజమాని అనుమతులు తీసుకోవాలని ఇప్పటికే గోడలపై రాజకీయ పార్టీలకు చెందిన వారి రాతలు ఉంటే తొలగించాలని ఎన్నికల మండల నోడల్ అధికారి తాహసిల్దారు వీరభద్రప్ప పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పాలన అధికారులకు సూచించారు శుక్రవారం మండల కేంద్రంలోని తాహసిల్దార్ కార్యాలయంలో ఎన్నికల నియామవళిపై ఎంపీడీవో మహ్మద్ అజార్ మోహియుద్దీన్. ఎంపీ ఓ సునీల్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నోడల్ అధికారి ఎన్నికల ప్రవర్తన నిబంధనలపై తాహ సిల్దార్ వీరభద్రప్ప మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ సర్పంచ్ వార్డ్ మెంబర్ల ఎన్నిక



మాట్లాడుతున్న మండల నోడల్ అధికారి తాహసిల్దార్ వీరభద్రప్ప

కోసం ఈ నెల 26 వ తేదీన షెడ్యూల్ విడుదల చేసిందని అలాగే ఎన్నికల తేదీలు నామినేషన్ ఫలితాలు తేదీ కూడా ప్రకటించిందని అందువల్ల 26వ తేదీ నుండి గ్రామాలలో ఎన్నికల నియామవళి ప్రవర్తన అమలులోకి వచ్చిందన్నారు సభలు ర్యాలీలు చేపట్టాలనుకుంటే ముందుగా అనుమతి తీసుకోవాలని అలాగే రాజకీయ పార్టీల కు చెందిన వారి విగ్రహాలు గ్రామాలలో ఉన్నట్లయితే వాటిని కప్పి ఉంచాలన్నారు. ఎన్నికల నిర్వాణ కోసం గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని అలాగే వారికి సహాయకులుగా గ్రామ పాలన అధికారులు ఉంటారని పంచాయతీ ఎన్నికలు కావడంతో కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి రాజకీయ పార్టీల అభ్యర్థుల ప్రచారలపై నిఘా ఉంచాలని బ్యానర్లు ఇంటి గోడలపై యజమాని అనుమతి తీసుకుని ఏర్పాటు చేస్తే ఆ ఖర్చు అభ్యర్థి ఖాతాలో వేయడం జరుగుతుందని చర్చిలు. మసీదులు. దేవాలయాల వద్ద నేను ఇంకోలా ప్రచారం నిర్వహించకుండా చూసుకోవాలన్నారు. ప్రైవేటు స్థలాల వద్ద సమావేశాలు నిర్వహించుకుంటే కచ్చితంగా అధికారుల నుండి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని మొదట దరఖాస్తు చేసుకున్న వారికి అనుమతులు ఇవ్వడం జరుగుతుందని ఆ తర్వాత రెండవ మూడవ వ్యక్తులకు అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. రోజుకు ఎప్పటికప్పుడు ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ప్రచార నిర్వహణలపై అలాగే ప్రజల ఫిర్యాదులపై మండల నోడల్ అధికారి దృష్టికి తీసుకువస్తే వాటిని జిల్లా నోడల్ అధికారి దృష్టికి తీసుకు పోతామన్నారు. ప్రశాంతంగా స్థానిక సంస్థలు ఎన్నికల నిర్వహణ కోసం అధికారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మహమ్మద్ అజార్ మోహియు ద్దీన్. ఎంపీఓ సునీల్. ఆర్ ఐ. లు మనోహర్. మదన్ మోహన్. పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు..

# నిబంధనల ప్రకారమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

**వ్యవసాయ మార్కెట్ కమిటీ గోడౌన్ పరిశీలన.. అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్**

**వనపర్తి, నవంబరు 28 ప్రభాతవార్త:** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎఫ్ఏక్యూ ( ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ) నిబంధనల ప్రకారం మాత్రమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఖీమ్యా నాయక్ శుక్రవారం పానుగల్ మండల పరిధిలోని ఐకెపి వరి కొనుగోలు కేంద్రం, వ్యవసాయ మార్కెట్ కమిటీ గోడౌన్‌కు పర్యటించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎఫ్.ఏ.క్యూ నిబంధనల ప్రకారం మాత్రమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. అన్ని రిజిస్టర్లను సరిగా నిర్వహించాలని, కొనుగోలులో ముందుగా వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే, ట్యాగ్ చేయబడిన మిల్లుకు తరలించాలని



మార్కెట్ కమిటీ గోడౌన్ ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఆదేశించారు. ఆ తర్వాత, కొత్తపేట గోడౌన్‌కు వెళ్లి, సీఎంఆర్ కింద మిల్లుల నుంచి డెలివరీ అయిన బియ్యం నిల్వలను పరిశీలించారు. నాణ్యత, నిల్వ విధానాలపై అధికారులకు సూచనలు చేశారు. అంతకుముందు, పానుగల్లు మార్కెట్ కమిటీ గోడౌన్‌ను సందర్శించి, కొత్తగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేయడానికి అందుబాటులో ఉన్న ఖాళీ స్థలం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్‌తో పాటు, పాన్‌గల్ తహసీల్దార్, జిల్లా పౌర సరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, డీఎం జగన్ మోహన్ పాల్గొన్నారు.

# శివకుమార్‌ను అభినంధించిన ఐక్యరాజ్య సమితి...

**ఢిల్లీలో ప్రత్యేక కిట్ బహుకరించిన ఐక్యరాజ్య సమితి ప్రతినిధులు**

**కల్వకుర్తి, నవంబర్ 28 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామివివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్‌ను ఢిల్లీలోని ఐక్యరాజ్య సమితి అధికారిక కార్యాలయంలో ఐక్యరాజ్య సమితి ప్రతినిధులు సుశీల్ చౌదరి, బిసాతి భరత్‌లు అభినందించారు. సేవా బృందం ఆధ్వర్యంలో 13 సం॥ల నుంచి చేస్తున్న సేవా కార్యక్రమలను, అలాగే రైతులకు అందిస్తున్న సేవలను శివకుమార్ ఐక్యరాజ్య సమితి ప్రతినిధులకు వివరించారు. అనంతరం సేవా కార్యక్రమలను, ఇటీవల శివకుమార్ అందుకున్న జాతీయ యువజన అవార్డును ఐక్యరాజ్య సమితి ప్రతినిధులు అభినందించారు. అలాగే శివకుమార్‌కు ఐక్యరాజ్య సమితి ప్రత్యేక కిట్ బహుకరణ చేశారు. శివకుమార్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఐక్యరాజ్య సమితి వాలంటీర్ సంస్థతో కలిసి తెలంగాణ వ్యాప్తంగా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించబోతున్నాం అని తెలిపారు.




శివకుమార్‌కు కిట్ బహుకరిస్తున్న ఐక్యరాజ్య సమితి ప్రతినిధులు

# ఎన్నికల నిబంధనలను జాగ్రత్తగా అమలు చేయాలి

**వనపర్తి, నవంబరు 28 ప్రభాతవార్త:** నామినేషన్ల ప్రక్రియలో ఏ చిన్న పొరపాటు జరగకుండా ఎన్నికల నిబంధనలను జాగ్రత్తగా అమలు చేయాలని రిటర్నింగ్ అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ గ్రామ పంచాయతి రెండో, మూడో దశ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ పై ఎన్నికల సాధారణ పరిశీలకులు మల్లయ్య బట్టు, వ్యయ పరిశీలకులు శ్రీనివాసులు తో కలిసి సంబంధిత రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేసి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న ప్రక్రియలో ఏ చిన్న పొరపాటు జరగకుండా ఎన్నికల నిబంధనలను జాగ్రత్తగా అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. గ్రామ పంచాయతి మొదటి దశ ఎన్నికల నామినేషన్లకు గురువారం ఉదయం 10 గంటలకల్లా నోటిఫికేషన్ పబ్లిష్ చేయాలని, 10:30 గంటల నుండి 5 గంటల వరకు మాత్రమే నామినేషన్లను స్వీకరించాలని ఆర్వోలను ఆదేశించారు. అభ్యర్థులు నామినేషన్లను వేసినప్పుడు వారి నామినేషన్ పత్రాలను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాల్లో ఎక్కడ ఖాళీగా వదలకుండా అన్ని వివరాలను పూర్తి చేయమని వారికి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

తెలియజేయాలన్నారు. నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థితో పాటు మరో ఇద్దరి కంటే ఎక్కువ రిటర్నింగ్ అధికారి గదిలోకి రావడానికి అనుమతించవద్దని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన కరదీపికలో ప్రతి ఒక్క పేజీని తప్పకుండా చదవి, అర్థం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం హ్యాండ్ బుక్ లో నిర్దేశించిన సూచనల మేరకే విధులను జాగ్రత్తగా నిర్వహించాలని తెలియజేశారు. నామినేషన్ వేసిన తర్వాత ఎవరైనా అభ్యర్థులు విత్ డ్రా కోసం వస్తే వారి నుంచి తప్పనిసరిగా అనెక్షర్ 1 ఫారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ వేయడానికి వచ్చిన అభ్యర్థులు నిర్దేశించిన పత్రాలు తీసుకురాకపోతే వారి నామినేషన్ తిరస్కరించకుండా వారికి గడువుతో కూడిన నోటీసు ఇవ్వాలని సూచించారు. అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను జాగ్రత్తగా పరిశీలన చేయాలని కలెక్టర్ సూచించారు. రిటర్నింగ్ అధికారులు నామినేషన్ కేంద్రాల్లో ఎలాంటి పక్షపాతం లేకుండా వ్యవహరించాలని, ఎన్నికల సంఘం నిబంధనలకు ప్రకారమే నామినేషన్ల ప్రక్రియ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ అభ్యర్థుల నామినేషన్ పత్రాల్లో రిటర్నింగ్ అధికారులు ఏమి రాయవద్దని సూచించారు. అదేవిధంగా నామినేషన్ ప్రక్రియలో అధికారులు సమయపాలన పాటించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, డీపీవో తరుణ్, డిప్యూటీ సీఈఓ రామ మహేశ్వర్, టిపోటి శ్రీనివాసులు, రిటర్నింగ్ అధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### రిటర్నింగ్ అధికారుల పాత్ర అత్యంత కీలకం

**జిల్లా కాలెక్టర్ ఆదర్శ సురభి**



సమావేశానికి హాజరైన అధికారులు



ట్రైనీ కలెక్టర్లను కలిసిన రచయిత

## ట్రైనీ కలెక్టర్లను కలిసిన రచయిత షేక్ అస్లాం షరీఫ్

**వడ్డేపల్లి, నవంబరు 28 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రం అయిన గద్వాల ఎల్‌డిఓసి కార్యాలయంలో ట్రైని కలెక్టర్‌లు రాజకుమార్, నన్నూరి మనోజ్ కుమార్ రెడ్డిలను శాంతినగర్‌కు చెందిన కవి, రచయిత షేక్ అస్లాం షరీఫ్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాను రచించిన నవ్వులే నవ్వులు జోక్స్ పుస్తకం వారికి అందించారు. శాంతినగర్ సేవా సమితి వడ్డేపల్లిద్వారా చేపడుతున్న కార్యక్రమాల గురించి వారికి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా అస్లాం ను ట్రైనీ కలెక్టర్ లు అభినంధించి, భవిష్యత్తులో మరెన్నో మంచి రచనలు చేయాలని, సేవా సమితి ద్వారా సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు.

## అండర్-17 ఎస్జీఎఫ్ రగ్బీ టోర్నమెంట్‌కు మద్దూరు విద్యార్థుల ఎంపిక

**మద్దూరు, నవంబరు 28 ప్రభాతవార్త :** అండర్ 17 ఎస్జీఎఫ్ రగ్బీ టోర్నమెంట్‌లో పాల్గొనే రాష్ట్రస్థాయి జట్టుకు మద్దూరు మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాయ్స్) విద్యార్థులు నందీశ్వర్ రెడ్డి, శివ, గణేష్ ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన ఎంపిక పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచడంతో వీరికి రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కు అవకాశం లభించింది. ఈ నెల 29 నుండి 31 వరకు వరంగల్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలలో ఈ ముగ్గురు విద్యార్థులు పాల్గొననున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ వెంకటప్ప తెలిపారు. విద్యార్థుల ఎంపికపై ప్రధానోపాధ్యాయురాలు సవిత సంతోషం వ్యక్తం చేస్తూ "రాష్ట్రస్థాయిలో కూడా అదే స్ఫూర్తితో మెరుగైన ప్రదర్శన చేసి జాతీయ స్థాయికి ఎంపిక కావాలి" అన్నారు. విద్యార్థులను అభినందిస్తూ సీనియర్ ఉపాధ్యాయులు రఘు, బాలాజీతో పాటు ఉపాధ్యాయ బృందం శుభాకాంక్షలు తెలిపారు.

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ జానకీ

**నవాబ్‌పేట, నవంబరు 28 ప్రభాతవార్త :** గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి ధారావత్ మండల పరిధిలోని స్థానిక సంస్థల ఎన్నికలకు అనుసంధానంగా భద్రతా ఏర్పాట్లను బలపరిచే లక్ష్యంతో శుక్రవారం కారుకొండ, గురుకుంట, నవాబ్‌పేట నామినేషన్ కేంద్రాలను జిల్లా ఎస్పీ డి.జానకి ప్రత్యక్షంగా సందర్శించారు. నామినేషన్ కేంద్రాలలో జరుగుతున్న కార్యకలాపాలు, ప్రజల రాకపోకలు అక్కడి భద్రతా పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. అదేవిధంగా పరిధిలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను కూడా పరిశీలించి, అక్కడి పరిసరాలను సమీక్షి ంచి శాంతిభద్రతల పరంగా తీసుకోవాల్సిన పలు సూచనలను గుర్తించి సంబంధిత నవాబ్‌పేట ఎస్ఐ విక్రమ్‌కి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడకుండా అవసరమైన అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని కూడా సూచించారు. ప్రజలు భయభ్రాంతి లేకుండా తమ ఓటు హక్కును వినియోగించే వాతావరణం కల్పించడానికి పోలీసులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.

## గెలుపే లక్ష్యంగా సర్పంచు అభ్యర్థుల ఎంపిక

### నాయకుల ఆశీర్వాదాలు లేని ఆశావాహుల పని ఖతం...?

**ఉప్పునుంతల, నవంబరు28 ప్రభాతవార్త:** పార్టీ కోసం పనిచేశాం కదా.. నాయకుల అండ తనకే ఉంటుంది కదా అని ఆశావాహులు ఊహిం చుకున్నంత ఉండదని చెప్పవచ్చు. మండలంలో రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి అయిన వెంటనే గ్రామాలలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి , సమ్మర్థులను సర్పంచి అభ్యర్థిగా ఎంపిక చేసే ప్రక్రియ దాదాపుగా మొదలైంది. తమకు సర్పంచిగా పోటీ చేసే అవకాశం కల్పించాలని ఆశావాహులు నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కానీ స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులుగాతాము ఎంపిక చేసిన అభ్యర్థులను గెలుపే లక్ష్యంగా నాయకులు అప్రమత్తంగా పనిచేస్తున్నారు. ఆశావాహులు అనుకున్నంత సులువుగా ఎంపిక ప్రక్రియఉండదని, సర్పంచ్ అభ్యర్థులుగెలిచే సమర్థులకు తమ మద్దతు ఉంటుందని, నాయకులు అన్ని కోణాల్లో పరిగణాలోనికి తీసుకొని అందరికీ సమర్థులుగా ఉన్న వారికే అవకాశం ఉంటుందని చెబుతూ ఎంపికప్రక్రియలో నాయకులు కీలకపాత్ర పోషిస్తున్నారు. స్థానిక ఎన్నికలలో గ్రామాలలో ప్రజల మద్ద తు కూడగట్టుకుని సమర్థునికే సర్పంచ్ అభ్యర్థిగా ఎంపిక చేస్తూ మద్దతు ఇవ్వాలనే ఉద్దేశంతో నాయకులు పనిచేస్తున్నారు. మరికొన్ని గ్రామాలలో నాయకులు కొంతమంది మేధా వులు ఇస్తున్న సూచనల మేరకే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామాలలో అందరికీ అందుబాటులో ఉండి ప్రజా పాలన ప్రభుత్వంలో నిస్వార్థంగా పనిచేసే వ్యక్తులను ఎంపిక చేయాలని గ్రామాలలో పార్టీలు పటిష్టంగా ఎంపిక నిర్వహిస్తున్నట్లు తెలుస్తుం ది. ప్రజాపాలన ప్రభుత్వంలో గెలుపు సులువుగా ఉంటుందని తాను పార్టీకోసం అంకితభావంతో పని చేశానని ఆశావాహులు ఓటర్ల చుట్టూ, ఇతర ప్రాంతాల వలసల ఓట్ల వారికి ఫోన్ చేసి తమకు మద్దతు పలకాలని ఏకరువు పెట్టుకున్నట్లు తెలుస్తుంది. ఆశా వాహులు తనకే పార్టీ నాయకుల ఆశీర్వాదాలు ఉన్నాయని చెప్పుకుంటూ మరికొంతమంది అప్పుడే ఎన్నికల వాతా వరణం తలపించే విధంగా గ్రామాలలో నెలకొంది. తనకే మద్దతు ఉంటుందని చెప్పుకుంటున్న ఆశావాహుల విషయంలో నాయకులుచాలా జాగ్రత్తలు పాటిస్తూ ఎంపిక ప్రక్రియ కొనసాగి స్తున్నారు. అందరి అభిప్రాయాల మేరకు నిర్వహించాల్సి ఉండగా కొన్ని గ్రామాలలో నాయకుల అరచేతుల పాలన ఉన్నట్లుగా ఎంపిక ప్రక్రియ జరుగుతుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. కొన్ని గ్రామా లలో రిజర్వేషన్లు కల్పించడంతో తమకు ప్రశాంత వాతావరణం నెలకొందని కొన్ని సామాజిక వర్గాలు హర్షిస్తుండగా మరి కొన్ని గ్రామాల లో తాము అనుకున్న వ్యక్తులకు రిజర్వేషన్ కేటాయించకపోవడం బాధాకరమని కొంత నిరుత్సాహం చూపుతున్నారు. ఏది ఏమైనప్పటికీ స్థానిక సంస్థలఎన్నికల్లో ప్రజలు నాయకులు ఎంపిక చేసినంత మాత్రాన గెలుపు తథ్యమని అనుకోవడంఅవివేకమని చెప్పవచ్చు. కొంతమంది నాయకులు గ్రామాలలో కొంతమంది అభిప్రా యాల మేరకే ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తు న్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## సర్పంచ్ పదవులకు వేలం వేస్తున్న వైనం...?!

**గద్వాల టౌన్, నవంబర్28, ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ ఎన్నిక లకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో జిల్లాలోని ఆయా గ్రామ పంచాయతీలో గురువారం నుంచి సర్పంచు, వార్డు సభ్యుల నామి నేషన్లు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయ తీలను ఏకగ్రీవం చేసుకునేందుకు ప్రధాన పార్టీ నాయకులు, గ్రామస్తులు వేడివేడిగా సమావేశాలు నిర్వహించి సర్పంచులను ఏకగ్రీవంగా చేసేందుకు ఏకంగా వేలంపాట నిర్వహించడం అందరి నోటా చర్చనీయాంశమైంది. గట్టు, గద్వాల, ధరూర్, కేటిదొడ్డి మండలాలో పలు గ్రామాల సర్పంచ్ పదవుల కోసం కొందరు ఆశావహులు పోటాపోటీగా వేలం పాడారు. ఇలా వేలం పాట రూ. 25 లక్షల నుండి సుమారు కోటి రుపాయాక వరకు వెళ్లినట్లు సమాచారం. ఏకగ్రీవ ఎన్నిక ఊర్లతో పాటు చుట్టుపక్కల ఊర్లలోని ఏ నలుగురు ఒకదగ్గర చేరినా, ప్రధాన కూడళ్లు, టీస్టాళ్ల వద్ద ఇదే విషయంపై జోరుగా చర్చ నడుస్తోంది. ఏకగ్రీవం చేస్తే సర్పంచ్ అభ్యర్థులు లక్షల రూపాయలు ఎందుకు చెల్లిస్తారని మేధావులు ప్రశ్నిస్తున్నారు. ప్రజా స్వామ్యంలో ఓటు కన్నా నోటుకే ఎక్కువ ప్రాధాన్యత నిస్తున్నారని పలువురు వ్యక్తం చేస్తున్నారు. కేటిదొడ్డి మండలం చింతలకుంట 38.50 లక్షలుగద్వాల మండలం కొండపల్లి 60 లక్షలు, గొర్లఖాన్ దొడ్డి 57 లక్షలు వేలంపాడి ఏకగ్రీవం చేసినట్లు ఆయా గ్రామాల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

## గ్రామాల్లో ఎన్నికల సందడి




గ్రామ పంచాయతీ కార్యాలయం

**ధన్వాడ, నవంబరు 28 ప్రభాతవార్త :** రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ధన్వాడ మండలంలోని పలు గ్రామాల్లో యువత రాజకీయ రంగ ప్రవేశానికి సిద్ధమ వుతోంది. సర్పంచ్ పదవులకు పోటీ చేసేందుకు యువకులు, యువ నాయకులు విశేష ఆసక్తి చూపుతుండటం స్థానిక రాజకీయాల్లో కొత్త ఊపును తెచ్చింది. గతంలో పెద్దలు, అనుభవజ్ఞులు ఆధిపత్యం చూపిన గ్రామ పాలనలో ఇప్పుడు కొత్త ఆలోచనలు–కొత్త విజన్‌తో యువజన శక్తి ముందుకు రావడం చర్చనీయాంశమైంది. గ్రామాభివృద్ధి, పారదర్శకత, ప్రజాసేవ" అనే మూడు ముఖ్య లక్ష్యాలతో యువ ఆశావాహులు ప్రచార యోధుల్లా గ్రామాల్లోకి ప్రవేశిస్తున్నారు. ప్రజల్లో ఆకర్షణీయమైన నినాదాలు, డోర్‌టుడోర్ ప్రచారం, చిన్న సమావేశాలు ఇవన్నీ గ్రామాల్లో ఎన్నికల సందడి మరింత పెంచుతున్నాయి. పార్టీలకతీతంగా గ్రామ ప్రజలతో నమ్మకం, నేరుగా మాట వినడంపై యువ నాయకులు దృష్టి పెడుతున్నారు. గ్రామాల అభివృద్ధికి యువత హామీలు తాగు నీరు, వీధి దీపాలు, రహదారులు, డ్రైనేజీ సమస్యల పరిష్కారం డిజిటల్ సర్వీసులు గ్రామంలో అందుబాటులోకి తీసుకురావడం యువత, మహిళలు, రైతులకు ప్రత్యేక అభివృద్ధి పథకాలు అవినీతి లేకుండా పారదర్శక పాలన యువత ముందుకు రావడం గ్రామ రాజకీయాలలో కొత్త మార్పుకు నాందిగా మారుతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఎన్నికల ప్రకటనలతోనే ధన్వాడ మండలం మొత్తం పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది.

## అమరచింత మండల బిజెపి అధ్యక్షులుగా మల్లారెడ్డి ఎన్నిక

**అమరచింత నవంబర్ 28, ప్రభాతవార్త:** అమరచింత మండలంలోని కృష్ణం పల్లి గ్రామానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు మల్లారెడ్డిని అమరచింత మండల బిజెపి అధ్యక్షులుగా ఎంపిక అయ్యారు. బిజెపి మండల అధ్యక్షులుగా నాకు అవకాశం కల్పించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే స్థానిక ఎన్నికల్లో బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని ఆయన అన్నారు. కేంద్ర ప్రభు త్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బిజెపి కార్యకర్తలు ప్రతి గడపకు తీసుకెళ్లాలని ఆయన కార్యకర్తలను కోరారు. బిజెపిమండల అధ్యక్షులుగా ఎంపికైన సందర్భంగా బిజెపి సీనియర్ నాయకులు మేరవరాజు, క్యామభాస్కర్, మంగ లావణ్య, కురువ హరీష్, బిజెపి పట్టణ, మండల నాయకులు హర్షం ప్రకటించారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

పాటు, ఆ పిపిసి కేంద్రాలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. పిపిసిలకు అవసరమైన గన్నీ బ్యాగులు, లారీలను వెంటనే అందుబాటులోకి తేవాలని డిఎంసిఎస్‌కు స్పష్టంగా సూచించారు. బిజిలు (బ్యాంక్ గ్యారెంటీలు) సమర్పించిన మిల్లులకు మాత్రమే ధాన్యం ట్యాగింగ్ ఇవ్వాలని డిసిఎస్‌ఓను ఆదేశించారు. దీనికి మించి ఒక్క క్వింటల్ ధాన్యము కూడా మిల్లుల్లోకి ఏ పరిస్థితుల్లోనూ ప్రవేశించకూడదని స్పష్టం చేశారు. ఈ నియమానికి విరుద్ధంగా ఏదైనా విషయం తమ దృష్టికి వస్తే సంబంధిత డిటిసిఎస్ పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రైతుకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు కేంద్రాల్లో సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చూడాలని కూడా స్పష్టం చేశారు. సమావేశంలో డిఆర్‌డిఓ నర్సింహులు, జిల్లా పౌరసరఫరాల అధికారి గంప శ్రీనివాస్, పౌరసరఫరాల సంస్థ డిఎం రవి నాయక్, జిల్లా సహకార అధికారి కృష్ణ, డిపిఎం, ఎపిఎంలు, పిఎసిఎస్ సిఇఓలు, సిసిలు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి చెకుముఖి పోటీలో విద్యార్థుల ప్రతిభ

**శ్రీరంగాపూర్, నవంబరు 28 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా స్థాయి సైన్స్ చెకుముకి పోటీలలో శ్రీరంగాపూర్ మండలానికి చెందిన బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలు ఇంగ్లీష్ మీడియం విభాగంలో వైష్ణవి 8వ తరగతి, శ్రీనిధి 9వతరగతి, హేమలత 10వ తరగతి ద్వితీయ బహుమతి సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శుక్రవారం శ్రీరంగాపూర్ ఉన్నత బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్‌సాగర్ ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలియజేశారు.




విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

# గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలి

■ గద్వాల జిల్లా కలెక్టర్ బి. యం. సంతోష్

**గద్వాల టౌన్ నవంబర్28, ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యుల పదవులను వేలం వేయడం వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ రాజ్ సంస్థల ఎన్నికలను పూర్తిగా స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడం రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఎన్నికల్లో నామినేషన్ సమ యంలో బెదిరింపులు, దౌర్జన్యం, లంచాలు, సర్పంచ్/వార్డు పదవు లకు ఏకగ్రీవంగా వేలం వంటి అనైతిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇలాంటి చర్యలు ప్రజా స్వామ్యానికి విరుద్ధమని, ఎన్నికలు నిస్పక్షపాతంగా నిర్వహించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 171.ఎ ప్రకారం ఎన్నికలలో అక్రమ ప్రవర్తనలు, సెక్షన్ 171.బి ప్రకారం లంచగొండితనం, సెక్షన్ 171.సి ప్రకారం ఓటర్లపై అను చిత ప్రభావం లేదా బెదిరింపులు ఎన్నికల నేరాలుగా పరిగణించ బడతాయని తెలిపారు. వీటికి సెక్షన్ 171.ఇ మరియు 171.ఎఫ్ ప్రకారం ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించవచ్చు, అలాగే అనైతిక చర్యలకు పాల్పడిన వారు ఆరు సంవత్సరాల పాటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులు అవుతారని తెలిపారు. పదవులను వేలం వేయడం, లంచగొండిత నం, అనుచిత ప్రభావం వంటి ఎవరైనా నామినేషన్ లేదా ఉప సంహరణ సమయంలో అడ్డంకులు సృష్టించినా, బెదిరింపులు చేసినా, లేదా ఇతర ప్రలోభాలకు గురిచేసినా పదవుల ను వేలం వేస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ తెలియజేశారు. అలాగే సంబంధిత ఎన్నికల అధికారులు ఇలాంటి చర్యలపై నిఘా ఉంచాలన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలను ఖచ్చి తంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు భయపడకుం డా, ఎటువంటి ప్రలో భాలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించేం దుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు.



జిల్లా కలెక్టర్ సంతోష్

## నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్

**ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలి : మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 28 ప్రభాతవార్త:** తొలి విడత గ్రామ పంచాయతీలకు జరుగనున్న ఎన్నికలలో రెండవ రోజు రాజాపూర్, తిరుమలాపూర్ పంచాయతీ కార్యాలయాలలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి సందర్శించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రంలో సదు పాయాలు పరిశీలించారు. నామినేషన్ పత్రాల స్వీకరణకు చేసిన ఏర్పాట్లు గమనించి పలు సూచనలుచేశారు. హెల్ప్ డెస్క్, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ సరి పడా ఉన్నారా అని ఆరా తీశారు. నోటీసు బోర్డులపై అతికించిన నోటిఫికేషన్ పత్రాలను తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగ కుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించి జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహిం చాలనిఅన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందే హాలు ఉన్నా, ఉన్నతాధికారులను సంప్రదించాలనిఅన్నారు. రాజా పూర్ మండలంలోగ్రామపంచాయతీ కార్యాలయంలో తిరుమలా పూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామంలో జరుగుతున్న నామినేషన్ ప్రక్రియలు పరిశీలించిన కలెక్టర్ విజయేందిరబోయి పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్ల వివరాలను, నామినేషన్ వివ రాలు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పక్కనే ఉన్నఅంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడిలలో గర్భి ణీలు, పిల్లలకు సక్రమంగా పౌష్టిక ఆహారం అందించాలని అన్నారు.

**వరి, మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్...**

రాజాపూర్ మండలంలో చెన్నవెల్లి గ్రామంలోని ఐకెపి వరిధాన్యం కొనుగోలు కేంద్రంను కలెక్టర్ విజయేందిర బోయి తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో రైతులు తెచ్చిన ధాన్యం వెంటనే ఎప్పటిక ప్పుడు తేమశాతం చెక్ చేయాలనీ, తేమ శాతం వచ్చిన ధాన్యం తూకం వేసి కొనుగోలు చేయాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు టాబ్ ఎంట్రీలు పెండింగ్ ఉంచకుండా ఎప్పటిక ప్పుడు పూర్తి చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం ను వెంట



నామినేషన్ కేంద్రంలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

వెంటనే లారీలలో లోడ్ చేసి మిల్లులకు తరలించాలని అధికారుల ను ఆదేశించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల గురించి సంబంధిత రికార్డులను పరిశీలించారు. రాజాపూర్ మండలం తిరుమలాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో కలెక్టర్ రైతులతో మాట్లాడి వారికి అందిస్తున్న సౌకర్యాలపై వివరా లు తెలుసుకున్నారు. మొక్కజొన్న సేకరణ కేంద్రంలో రైతుల నుంచి సేకరించిన మొక్కజొన్న నిల్వల నాణ్యతను స్వయంగా పరిశీలించి, కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరుగుతున్నదా అనే అంశాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం ప్రమా ణాలు సరిగ్గా పాటించబడుతున్నాయా లేదా అనే విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అలాగే ప్రతి కొనుగోలు కేంద్రంలో సరిపడా అన్ని వసతులను అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. రైతులు తెచ్చిన పంటను నిల్వ చేయడంలో లేదా తరలించడంలోసమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన మొక్కజొన్న ఆన్లైన్ వివరాల నమోదు ప్రక్రియను, రికార్డులను పరిశీలించారు. అనంతరం తిరుమలాపూర్ గ్రామంలో పెన్షన్ తీసుకునేందుకు వచ్చిన వికలాంగులు, వృద్ధులతో పింఛన్లు పంపిణీ పై ఆరా తీశారు. కలెక్టర్ వెంట మండల అధికారులు పాల్గొన్నారు.

## టీపోల్ మొబైల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్

**మహబూబ్‌నగర్, నవంబరు 28 ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల సౌలభ్యం కోసం అందుబాటులోకి తెచ్చిన టీపోల్ మొబైల్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. టీపోల్ యాప్ ద్వారా ఓటర్లు తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉంది అనే వివరాలను పరిశీలించుకోవడంతో పాటు, ఓటరు స్లిప్ ను డౌన్లోడ్ చేసుకోవచ్చని అన్నారు. అలాగే టియాప్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఏవైనాఅభ్యంతరాలు ఉంటే, వాటిని కూడా తెలియజేయవచ్చని అన్నారు. అభ్యంత రాలు, ఫిర్యాదులు ఎం.పీ.డీ.ఓలకు చేరుతాయని, వాటిని పరిశీలించి తక్షణమే పరిష్కరిస్తారని కలెక్టర్ తెలిపారు. ప్లే స్టోర్ నుండి ఈ యాప్‌ను హెచ్‌టిటిపిఎస్:/.ప్లే.గూగుల్.కాం/స్టోర్/యాప్స్/డిటేల్స్ లింక్ ద్వారా డౌన్ లోడ్ చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు.

## నేటి ఐజెయు జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయండి

**-యూనియన్ జిల్లా కన్వీనర్ విజయరాజు**

**భూత్పూర్, నవంబర్28, ప్రభాతవార్త:** ఇండియన్ జర్నలిస్ట్ యూని యన్ అనుబంధమైన టీయుడబ్లుజె మహబూబ్‌నగర్ జిల్లా మూడో మహాసభలు శనివారం ఉదయం 9గంటల నుంచి సాయం త్రం 5గంటల వరకు జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఉన్న శివం కన్వెన్షన్ హాల్‌లో జరుగుతున్న నేపథ్యంలో జిల్లాలోని ఐజెయు సభ్యుడైన ప్రతి జర్నలిస్టు తప్పకుండా హాజరై మహాసభ లను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా కన్వీనర్ విజయరాజు శుక్రవారం పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధిం చి విజయరాజు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సంద ర్భంగా విజయరాజు మాట్లాడుతూ ఈ మహాసభలకు రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ్మా, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో పాటు ప్రెస్ అకాడెమి చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డి, ఎంపి డీకె అరుణ, ప్రభుత్వ ప్రతినిధి ఎపి జితేందర్‌రెడ్డి, దేవులపల్లి అమర్‌లు ముఖ్యఅతిథులుగా, విశిష్ట అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జిమధుసూధన్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనురుధ్ రెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్‌రెడ్డి, ఏవీఎన్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ తదితరులతో పాటు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రాం నారా



మీడియాతో మాట్లాడుతున్న ఐజెయు జిల్లా కన్వీనర్ విజయరాజు

యణ, కార్యదర్శి మధుగౌడ్, కార్యవర్గ సభ్యుడు కన్నయ్యలతో పాటు ప్రత్యేకఆహ్వానితులుగా జిల్లాకలెక్టర్ విజయేంద్ర బోయి, జిల్లా ఎస్పీడిజానకి హాజరౌతున్నారని జిల్లాలోని మండల, నియోజకవర్గ, జిల్లాలోని ఐజెయు సభ్యుడైన ప్రతి జర్నలిస్టు హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. మహా సభల అనంతరం సాయంత్రం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్ను కుంటారని ఈ మహాసభలకు ఐజెయు ప్రతి సభ్యుడు తప్పనిసరి గా హాజరు కావాలని కన్వీనర్ విజయరాజు కోరారు. ఈ కార్య క్రమంలో జర్నలిస్టులు సతీష్‌కుమార్‌రెడ్డి, ప్యాట వెంకటయ్య, చంద్రశేఖర్ గౌడ్, విద్యాసాగర్‌రెడ్డి, నాగరాజు, భాస్కరరావు, రవీందర్‌గౌడ్, సుదర్శన్, వెంకటేష్, పవన్‌కుమార్‌రెడ్డి, రఘు, గొడుగు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా భద్రతే - పోలీసుల ప్రధాన బాధ్యత

◆ మహబూబ్‌నగర్ జిలా ఎస్పీ డి.జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 28 ప్రభాతవార్త :** మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం (ఎహెచ్‌టియు) 2025 నవంబర్ నెలలో జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు గ్రామాలలో మొత్తం 24 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ డి. జానకి తెలిపారు. మహిళా భద్రత విభాగం హైదరాబాద్ ఆదేశాల మేరకు, అంతర్జాతీయ స్థాయిలో ఇంటర్‌పోల్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆపరేషన్ స్ట్రోమ్ మేకర్స్ –3" ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఈ కార్యక్రమాలు చేపట్టబడినవి. ఈ ప్రత్యేక ఆపరేషన్ 10.11.2025 నుండి 21.11. 2025 వరకు కొనసాగి, మానవ అక్రమ రవాణాలో పాల్గొనే నేర ముఠాల కార్యకలా పాలను అడ్డుకోవడం, విచ్ఛిన్నం చేయడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లాలో మానవ అక్రమ రవాణా, సంబంధిత నేరాలుచోటుచేసుకునే 40 హాట్‌స్పాట్ ప్రాంతాలను ఎహెచ్‌టియు బృందంసందర్శించింది. ఈ సందర్భంగావెట్టి చాకిరీ నుంచి ముగ్గురు చిన్నారులను రక్షించారు. పోతనపల్లి గ్రామంలో ఇద్దరు మైనర్లను గొర్రెల కాపరులుగా పనిలో పెట్టుకున్నట్లు గుర్తించి, చైల్డ్‌లైన్ సహకారంతో వారిని రక్షించి ఓపెన్ షెల్టర్‌కు పంపించారు. ఈ ఇద్దరు పిల్లలను పనిలో పెట్టుకున్న వ్యక్తులపై మహబూబ్‌నగర్‌రూరల్ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదు



చేశారు. బేకరీబట్టీలో ఒక మైనర్‌ను రక్షించి, 1టౌన్ పోలీస్ స్టేషన్‌లో యజమానిపై కేసునమోదు చేశారు. పనిస్థలాల్లో గుర్తించిన ఆరుగురు పిల్లలను తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ చేసి, ఇకపై పిల్లలను పనుల్లో పెట్టుకోరాదని హెచ్చరించారు. ఎహెచ్‌టియు బృందం గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలలో తిరు గుతూ క్రింది అంశాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించింది. బాల్య వివాహాలు మానవ అక్రమ రవాణా అవయవాల విక్రయం, బాలకార్మికుల వెట్టి చాకిరీ, పిల్లల అక్రమ దత్తత, మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాలు అసాంఘిక కార్యకలా పాలు, వ్యభిచార గృహాల నిర్వహణ, గర్భ విచ్ఛిన్నం వంటి నేరాలు పాఠశాల పిల్లలను పని కోసం వినియోగించడం, గొర్రెల కాపరులుగాలేదా పశువుల కాపరులుగా పెట్టడం, ఇటుక బట్టీల్లో పనిచేయించడం పూర్తిగా నేరం అని ప్రజలకు వివరించారు. జిల్లాలో మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలు, వెట్టి చాకిరీ, మహిళలు–పిల్లలపై నేరాలను గమనించి నా లేదా అనుమానం వచ్చినా వెంటనే తెలియజేయగలరని అన్నారు. డయల్ 100ఏ.హెచ్.టి.యు 8712680066 సమా చారం అందించినవారి వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయి. మహబూబ్‌నగర్ జిల్లా పోలీసుల తరఫున ప్రతి పౌరుడి భద్రత మా బాధ్యత, మా కర్తవ్యం అన్నారు.

## బిజెపి మండల స్థాయి కార్యకర్తల సమావేశం

**శ్రీరంగపూర్, నవంబరు28 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండలం కబలాపురం గ్రామంలో బిజెపి మండల స్థాయి కార్యకర్తల సమా వేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ప్రతి గ్రామంలో బిజెపి అభ్యర్థులు పోటీలో ఉండాలని జిల్లా అధ్యక్షులు డి.నారాయణ పేర్కొవడం జరిగింది. అలాగే ప్రతి గ్రామ సమా చారం ప్రకారం పోటీలో ఉండే అభ్యర్థుల పేర్లు నమోదు చేసుకు న్నారు. ప్రతి మండలంలోని అన్ని గ్రామాలలో సర్పంచులు, వార్డ్ మెంబర్లు బిజెపి తరఫున బరిలో ఉంటారని పేర్కొనడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అందించే పథకాలను ప్రజలకు వివరించాలని సూచించడం జరిగింది. ప్రతి గ్రామంలో బిజెపి అభ్యర్థులను గెలిపించే విధంగా కార్యకర్తలు పనిచేయాలనిసూచించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచు ల ఇంఛార్జి బి. శ్రీశైలం, మండల అధ్యక్షులు నల్లబోతుల విష్ణువర్ధన్ నాయుడు, సీనియర్ నాయకులు రాములు యాదవ్, రాజు, ప్రధాన కార్యదర్శి సిట్టి రాజుల శివ, యువ మోర్చా అధ్యక్షులు నరేష్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, రాజేష్, శివ, భాను సోషల్ మీడియా కన్వీనర్ చరణ్, రాజేష్, శివ, భాను తదితరులు పాల్గొనడం జరిగింది.

## శ్రీశ్రీ రంగనాయక స్వామిని దర్శించుకున్న తూడి నవనీత్ రెడ్డి

**శ్రీరంగాపూర్, నవంబరు28 ప్రభాతవార్త:** శ్రీరంగపూర్ మండల కేంద్రంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీశ్రీ రంగనాయక స్వామి దేవాలయాన్ని వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి కుమారుడు తూడి నవనీత్‌రెడ్డి శుక్రవారం దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఆలయం యొక్క విశిష్టతను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆలయఅభివృద్ధికి కృషి చేస్తా మని పేర్కొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాకిటి ఆదిత్య ముదిరాజ్, శ్రీరంగాపూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజు, పెబ్బేరు మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేష్, శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా సోషారి రమేష్, శ్రీరంగాపూర్ మండల్ మాజీఉప సర్పంచ్ మహేష్‌గౌడ్, మండల మాజీ వార్డ్ మెంబర్ ఆంజనేయులు, మండల కాంగ్రెస్ నాయకు లు టైలర్‌ఆంజనేయులు, పశుల రాజవర్ధన్, సురేష్, శ్రీరాములు, పరుశురాం, మూర్తి, బిసన్న, రాఘవేంద్ర, లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వ్యక్తులు వారి నేర చరిత్రను తెలియపరచాలి: ఎంపీడీవో


**కృష్ణ, నవంబరు 28 ప్రభాతవార్త:** పంచాయితీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కనీసం 21 సంవత్సరాల తో పాటు అభ్యర్థి అనువైన ప్రాంతంలో ఓటర్ లిస్టులో ఓటరుగా పేరు నమోదు అయ్యి ఉండాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. అలాగే కుల ధృవీక రణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, ఎన్ఓసీ, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, నూతన 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, రేషన్ కార్డు, ఆస్తుల వివరాలు గల సర్టిఫికెట్లు ఏర్పాటు చేసుకోవాలని ఆమె సూచించారు. పోటీచేసే అభ్యర్థులు ముఖ్యంగా నేరచరిత్రనుఎన్నికల సంఘానికి ప్రజలకు ప్రకటించాల్సిన బాధ్యతను గుర్తుచేశారు. ఈ విధంగా ఎన్నికలను మరింత పారదర్శకంగా, న్యాయవంతంగా నిర్వహించేందుకు ఉపయోగపడుతుందన్నారు.

## అక్రమ మద్యం పట్టివేత

**మక్తల్ టౌన్, నవంబరు 28 ప్రభాతవార్త:** గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అక్రమ కార్యకలాపాలను నిరోధించేందుకు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో భాగంగా, మక్తల్ మండలంలోని జక్లేర్ గ్రామానికి చెందిన కలాల్ శివాజీ గౌడ్ తండ్రి నారాయణ గౌడ్ నిర్వహిస్తున్న కిరాణా షాపులో అక్రమ మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు నమ్మదగినసమాచారం మేరకుటాస్క్‌ఫోర్స్ సిబ్బ ంది, మక్తల్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహిం చారు. దాడుల సందర్భంగా మొత్తం 33.24 లీటర్ల అక్రమ మద్యం, దాదాపు రూ. 25,000/ విలువ గలమద్యంను స్వాధీనం చేసు కొనిపోలీసుస్టేషన్‌కు తరలించి కలాల్ శివాజీగౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి తెలిపారు.

## ఉన్నత లక్ష్యాల కోసం శ్రమించాలి

**మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**



**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు28 ప్రభాత వార్త :** పయనీర్ కార్యక్ర మంలో భాగంగా మహ బూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశా లలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా ఎప్సెట్, నీట్ ఎంట్రెన్స్ శిక్షణస్టడీ మెటీరియల్స్‌ను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తమ స్వంత నిధులతో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థిదశలో కష్టపడి చదివితే భవిష్యత్తు విష యంలో ఎలాంటి ఆందోళన ఉండదని, యువత ఈ దశలోనే తమ సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాల సాధన కోసం శ్రమించాలి. పుస్తకాలతో స్నేహం చేసి, క్రమశిక్షణతో ముందుకెళ్తే విజయం తప్పక వరిస్తుంది" అని అన్నారు. చదువు పై నిరక్ష్యం చూపితే జీవితాంతం తీవ్రమైన కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యే యువతకు అసలైన ఆయుధమని, ప్రతివిద్యార్థి తనలక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుని దాన్ని సాధించే దిశగా అంకితభావంతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. గత సంవత్సరం ఎప్సెట్‌లో పయనీర్ విద్యార్థులు 114 మంది ఉత్తమ ర్యాంకులు సాధించారని పేర్కొంటూ, ఈసారి అంతకుమించి మరిన్ని ర్యాంకులు సాధించి మహబూబ్‌నగర్ ప్రతిష్టను పెంపొందిం చాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భగవంతచారి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుద్ధారం సుధాకర్ రెడ్డి, హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.